# నేటి నిజం

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ బుధవారం 3-5-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 202 పేజీలు:6 వెల: రూ.1/-


## తెలంగాణలో మూడు రోజులు వర్షాలు..!

హైదరాబాద్, మే2: రాష్ట్రవ్యాప్తంగా రాగల మూడు రోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, వడగళ్లతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీసే అవకాశం ఉందని, పలు జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక బుధవారం నుంచి శుక్రవారం వరకు పలుజిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదుగాలులతో అక్కడక్కడ వానలు పడే సూచనలున్నాయంటూ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అయితే, వాతావరణంలో మార్పులు, బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను వల్లే వర్షాలు కురుస్తున్నాయని వాతావరణశాఖ డైరెక్టర్ నాగరత్న తెలిపారు. దక్షిణ మధ్యప్రదేశ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు ఇంటీరియర్ కర్ణాటక, మరాత్వాడా వరకు ద్రోణి కేంద్రీకృతమై ఉందని వివరించారు. ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా.. రాబోయే మూడు గంటల్లో హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.

## ఈ కామర్స్ రంగం వేగంగా దూసుకుపోతోంది : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మే2: సంగారెడ్డిలో ఫ్లిప్‌కార్ట్ ఫుల్ ఫిల్‌మెంట్ సెంటర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ వర్చువల్ విధానంలో మంగళవారం ఉదయం ప్రారంభించారు. బేగంపేటలోని ఐటీసీ కాకతీయలో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఐటీ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఫ్లిప్‌కార్ట్ సీఈవో కల్యాణ్‌తో పాటు పలువురు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. సంగారెడ్డిలో ఫ్లిప్ కార్ట్ ఫుల్ ఫీల్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసినందుకు ఆ యాజమాన్యానికి మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఫ్లిప్ కార్ట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల మందికి ఉపాధి కల్పన లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కామర్స్ రంగం వేగంగా దూసుకుపోతోందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏం చేస్తే దేశం అదే ఫాలో అవుతుంది. రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక బృందాలు విజయవంతంగా పని చేస్తున్నాయి. ఉపాధి కల్పనలో మహిళలకు 50 శాతం ప్రాధాన్యం ఇవ్వాలి. దేశానికి తెలంగాణను రోల్ మోడల్‌గా మారుద్దాం అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## గీతన్నలకు శుభవార్త.. 'గీత కార్మికుల బీమా' అమలుకు సీఎం కేసీఆర్ నిర్ణయం..!

హైదరాబాద్, మే2:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇప్పటికే రైతులకు రైతుబీమా అమలు చేస్తున్నది. ఇదే తరహాలో గీత కార్మికులకు సైతం 'గీత కార్మికుల బీమా'ను అమలు చేయాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నిర్ణయించారు. కల్లు గీసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో మృతుడి కుటుంబానికి రూ. 5లక్షల బీమా సాయాన్ని నేరుగా ఖాతాలో జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సీఎం కేసీఆర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను రూపొందించాలని, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును సీఎం ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కల్లుగీత సందర్భంగా ప్రమాదవశాత్తు జారిపడి ప్రాణాలు కోల్పోతున్న దురదృష్ట సంఘటనలు జరుగుతుంటాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.

అలాంటి ఊహించని దురదృష్టకర సందర్భాల్లో మరణించిన కల్లుగీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఇప్పటికే ఎక్స్ గ్రేషియా అందిస్తున్నా బాధితులకు అందడంలో ఆలస్యమవుతున్నదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రైతన్నల కుటుంబాల కోసం అమలు చేస్తున్న రైతుబీమా తరహాలోనే, కల్లుగీతను వృత్తిగా కొనసాగిస్తున్న గౌడన్నల కుటుంబాలకు వారం రోజుల్లోనే బీమా నగదు అందేలా ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం అన్నారు. ఇందుకు సంబంధించి చర్యలు చేపట్టాలని మంత్రులకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సీఎం ఆదేశాలు జారీ చేశారు.



## కేసీఆర్ చిత్రపటానికి మేయర్ విజయలక్ష్మి పాలాభిషేకం



హైదరాబాద్, మే2: మే డే సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పారిశుధ్య కార్మికులకు రూ.1000 పెంచిన సందర్భంగా క్యాంపు కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో కలిసి మంగళవారం కేసీఆర్ చిత్రపటానికి నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ? కార్మిక పక్షపాతి సీఎం కేసీఆర్ మేడే సందర్భంగా రాష్ట్రంలోని పారిశుధ్య కార్మికులకు వేతనం పెంచడం సాహోసపేత నిర్ణయమన్నారు. కార్మికులకు నెలనెలా అందుతున్న జీతానికి అదనంగా మరో వెయ్యి రూపాయలు పెంచుతున్నట్లు ప్రకటించారన్నారు.

దేశంలోని ఏ రాష్ట్రంలో పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచలేదని, మన సీఎం కేసీఆర్ కార్మికుల పక్షపాతి అని మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి అన్నారు. జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న కార్మికులు చేస్తున్న సేవలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో ఇతర శాఖలైన మెట్రో, వాటర్ వర్క్స్ తో పాటుగా మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో పనిచేస్తున్న మొత్తం 1,06,474 మందికి లబ్ధి చేకూరుతుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నెంబర్ 39, 40 లను విడుదల చేసిందన్నారు. రాష్టానికి ఆర్థిక భారమైనా వెనుకాడకుండా కార్మికులకు మెరుగైన జీవనం కొనసాగించేందుకు తీసుకున్న గొప్ప నిర్ణయమని అందుకు ముఖ్యమంత్రికి మేయర్ ధన్యవాదాలు తెలిపారు.

## కర్ణాటకకు ఉచిత సిలిండర్లు ఇస్తున్నప్పుడు మాకెందుకివ్వరు - మోడీని నిలదీసిన కెటిఆర్



రాజన్న సిరిసిల్ల, మే2:(నేటి నిజం ప్రతినిధి): ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని బీజేపీ తన కర్నాటక ఎన్నికల ప్రచారంలో చెబుతోందని, మరి తెలంగాణ మాటేమిటని మంత్రి కేటీ రామారావు ప్రశ్నించారు. ఉచితాలు సరైనవి కావని ఇన్నాళ్లు బీజేపీ, ప్రధాని నరేంద్ర మోడీ గొంతు చించుకున్నారని, ఇప్పుడు అదే పార్టీ మూడు సిలిండర్లు ఉచితం, పాలు ఉచితం అని కర్నాటకలో తమ మేనిఫెస్టోలో ఎందుకు ప్రకటించారని నిలదీశారు.. సిరిసిల్ల పర్యటనలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ వాసిగా తాను ప్రధాని మోడీని ఒక ప్రశ్న అడుగుతున్నానని, మీరు దేశానికి ప్రధానా లేక కర్నాటకకు ప్రధానా అంటూ ప్రశ్నించారు.. దేశానికి ప్రధాని అయితే కర్నాటకకు ఇచ్చినప్పుడు తెలంగాణకు మూడు సిలిండర్లు ఉచితంగా ఎందుకు ఇవ్వరన్నారు. అలాగే మిగతా 28 రాష్ట్రాలలో ఎందుకు ఇవ్వరని అడిగారు. గత ప్రభుత్వ హాయాంలో రూ. 400 ఉన్న సిలిండర్ మోడీ పాలనలో అది రూ. 1200కు పెరిగిందని ఫైర్ అయ్యారు..పాలు, ఉప్పు,నీళ్లు, బియ్యం, బిస్కెట్లు, చేనేత వస్త్రాలపై పన్ను వేసిన ఘనత మోడికే దక్కుతుందన్నారు కెటిఆర్ .

## త్వరలో నిమ్స్ నూతన భవనానికి సీఎం శంకుస్థాపన : మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ నిమ్స్ దవాఖాన విస్తరణలో భాగంగా నిర్మించబోతున్న 2వేల పడకల నూతన భవనానికి త్వరలో సీఎం కేసీఆర్ భూమిపూజ చేస్తారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్ రావు వెల్లడించారు. ఈ మేరకు త్వరగా అన్ని ఏర్పాట్లు చేయాలని, అవసరమైన అన్ని విభాగాల అనుమతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిమ్స్ దవాఖాన విస్తరణలో భాగంగా నిర్మించబోతున్న 2వేల పడకల నూతన భవనానికి త్వరలో సీఎం కేసీఆర్ భూమిపూజ చేస్తారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్ రావు వెల్లడించారు. ఈ మేరకు త్వరగా అన్ని ఏర్పాట్లు చేయాలని, అవసరమైన అన్ని విభాగాల అనుమతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి హరీశ్ రావు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేదర్ సచివాలయంలో వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో తొలిసారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవనంలో ఓపీ, ఐపీ, ఎమర్జెన్సీ సేవలకు ప్రత్యేకంగా బ్లాకులు ఉంటాయన్నారు. భవనం మొత్తం ఎనిమిది అంతస్తులుగా ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం నిమ్స్‌లో 1500 పడకలు ఉన్నాయని, నూతన భవనం పూర్తయితే పడకల సంఖ్య 3,500కు చేరుతుందన్నారు. ఇటీవల భూమిపూజ చేసుకున్న సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్ కూడా పూర్తయితే మరో 200 పడకలు అదనంగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. తద్వారా ఒక నిమ్స్‌లోనే 3,700 పడకలు ఉంటాయని చెప్పారు. నిమ్స్ ఎంసీహెచ్ పనులు వేగవంతం చేయాలన్నారు. పెరుగుతున్న జనాభా, అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నలువైపులా ఒక్కొక్కటి వెయ్యి పడకలు కలిగి ఉండే టిమ్స్ దవాఖానలతోపాటు నిమ్స్ విస్తరణకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టినట్లు గుర్తు చేశారు.

దేశంలోనే తొలి సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్

గాంధీ దవాఖానలో నిర్మిస్తున్న 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్ పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఇది ప్రారంభిస్తే దేశంలోనే తొలి సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్‌గా రికార్డు సృష్టిస్తామని చెప్పారు. గాంధీలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ సంతాన సాఫల్య కేంద్రాన్ని, స్టేట్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ పనులను వేగవంతం చేయాలన్నారు. నిమ్స్‌లో మాదిరిగా గాంధీలోనూ అవయవ మార్పిడి సర్జరీలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను మంత్రి ఆదేశించారు. బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్లు జరిపి, అవసరమైన వారికి అవయవాలు అందించి పునర్జన్మ ప్రసాదించాలన్నారు. ఎంఎన్‌జే దవాఖానలో నూతనంగా ప్రారంభించిన ఆంకాలజీ బ్లాక్‌లో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందాలన్నారు. శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మానిటరింగ్ చేస్తూ ఉండాలన్నారు.

## నగరంలోని జూబ్లీహిల్స్ రోడ్ నెం.45 లో విషాదం

### -నీటిగుంతలో పడి ఆరేళ్ల బాలుడు మృతి



హైదరాబాద్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: నగరంలోని జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లో విషాదం చోటుచేసుకుంది. నీటిగుంతలో పడి ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. బాలుడు మృతితో కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. ఈ ఘటనతో ఆ ప్రదేశంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.కాగా అప్పట్లో హైదరాబాద్‌లోని కళాసిగూడలో మౌనిక అనే చిన్నారి నాలాలో పడి మృతిచెందింది. మరలా ఈ ఘటన చోటుచేసుకోవడంతో జనాలు భయాందోళనకు గురవుతున్నారు. పిల్లలను బయటకు పంపించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుంటున్నారు. ఎక్కడా అడుగువేస్తే గుంతలో పడతామో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షాలు కురుసినప్పుడల్లా ఇలాంటి ఘటనలు జరుగుతునే వున్నాయి. ఈ ఘటనలను దృష్టిలో పెట్టుకుని రోడ్ల విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వాపోతున్నారు.

## రైతులు ఆందోళన చెందొద్దు.. : మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



హైదరాబాద్, మే2: అకాల వర్షాలు రైతులను ఆగం చేశాయని, అనేక మంది రైతులు పంటలు నష్టపోయారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కేంద్రం కాదన్నా.. వద్దన్నా సీఎం కేసీఆర్ ప్రభుత్వం తరఫున ధాన్యం కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ధాన్యం కూడా తడవడం రైతులకు ఆశనిపాతంగా మారిందన్నారు. అయితే, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందంటూ రైతులకు మంత్రి భరోసానిచ్చారు.

దేవరుప్పుల మండలం సీతారాంపురం గ్రామంలో ఆకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని మంత్రి మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని లోతట్టు ప్రాంతంలో పెట్టడంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, గోదాములకు తరలించాలని సూచించారు.

ఈ సందర్భంగా దేవరుప్పుల మండలం చిన్న మదూరు గ్రామంలో మంగళవారం జరిగిన రేణుక ఎల్లమ్మ పండుగ వేడుకల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు. గ్రామస్తులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్తులందరనీ చల్లగా చూడాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. సందర్భంగా మంత్రికి చిన్న మదూరు గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, పాల్గొన్నారు.

### నేటి కందం- నేటికి అందం

కం॥ భువనమున 'పత్రికలు –
అవసరము 'స్వేచ్ఛ' నొసగి – ఆత్మీయంబౌ
వివరములు ప్రజల కిచ్చెడి
'దివసము'గా నీదినమును తెలియంగ వలెనో !!



-రాధశ్రీ

సెల్:9494481210

(మే 3 ప్రపంచ పత్రికా స్వేచ్ఛాదినోత్సవం..)

## జూన్ 20వ తేదీన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్, మే2:జూన్ 20వ తేదీన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. బల్కంపేట ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమంలో మంత్రి తలసాని పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం అద్భుత పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుకుందని తెలిపారు. ప్రతి సంవత్సరం అమ్మవారి కళ్యాణాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నాం.. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో అమ్మవారి కళ్యాణాన్ని నిర్వహిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆలయాలు ఎంతో అభివృద్ధి చెందాయని స్పష్టం చేశారు. బల్కంపేట ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరిగిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

## ఆహ్వానం రాకపోవడం వల్లే గవర్నర్ హాజరుకాలేదు

### - మంత్రి జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలు శుద్ధ అబద్ధం

హైదరాబాద్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రాజ్‌భవన్, ప్రగతిభవన్ మధ్య పంచాయతీ ముగిసిందని అందరూ అనుకున్నారు. గవర్నర్ తమిళి సై సీఎం కేసీఆర్ మధ్య సయోధ్య కుదిరిందని భావించినా తాజా పరిణామాలతో విభేదాలు తెరపైకి వచ్చాయి. ఈసారి గవర్నర్ వర్సెస్ ప్రగతిభవన్ మధ్య కొత్త లొల్లి మొదలైంది. మంత్రి జగదీష్‌రెడ్డి ఆరోపణలపై రాజ్‌భవన్ స్పందించింది. సచివాలయం ప్రారంభోత్సవానికి ఈర్ష్యతోనే గవర్నర్ రాలేదంటూ జగదీష్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. జగదీష్‌రెడ్డి విమర్శలకు గవర్నర్ తమిళిసై సమాధానమిచ్చారు. కొత్త సచివాలయం ప్రారంభోత్సవానికి ఎలాంటి ఆహ్వానం అందలేదని తెలిపారు. గవర్నర్‌కు ఆహ్వానం పంపించారనేది తప్పుడు ప్రచారమని పేర్కొన్నారు. "మాకు ఎలాంటి ఆహ్వానం అందలేదు. ఆహ్వానం రాకపోవడం వల్లే గవర్నర్ హాజరుకాలేదు" అని రాజ్‌భవన్ కార్యాలయం నోట్ రిలీజ్ చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర అధికార పక్ష ప్రజాప్రతినిధులందరా హాజరయ్యారు. గవర్నర్ తమిళిసై, ప్రతిపక్ష నేతలు మాత్రం హాజరు కాలేదు. సచివాలయ ప్రారంభ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించింది. ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర గవర్నర్ తమిళిసైకి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ప్రభుత్వం ఆహ్వానం పంపింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులను కూడా ఆహ్వానించింది. ఎమ్మెల్యేలకు ఆయా జిల్లాల అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆహ్వానాలను పంపించారు. అలాగే ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులను కూడా ఆహ్వానించారు. కానీ, గవర్నర్‌తో పాటు ప్రతిపక్షాలకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా గైర్హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు ఏ పార్టీకి చెందినా.. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే అధికారిక కార్యక్రమాలకు హాజరవడం ఆనవాయితీ.

సచివాలయ నిర్మాణ విషయంలో మొదటి నుంచి ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. పాత సచివాలయం బాగానే ఉందని, దాన్ని కూల్చవద్దని ప్రతిపక్ష పార్టీలు చెప్పాయి. ఇంత భారీగా ఖర్చు చేసి కొత్త సచివాలయాన్ని నిర్మించాల్సిన అవసరం లేదని విమర్శించాయి. సచివాలయ భవన నిర్మాణ నిధులతో రాష్ట్రంలో నూతనంగా ఆస్పత్రులను నిర్మించాలని ప్రతిపక్షాలు సూచించాయి. కానీ, ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో విపక్షాలు కొత్త సచివాలయ ప్రారంభ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఇక గవర్నర్ తమిళిసైతో రాష్ట్ర ప్రభుత్వానికి సత్సంబంధాలు లేవు. గత కొంత కాలంగా ప్రభుత్వం తీసుకుంటున్న పలు నిర్ణయాలను గవర్నర్ వ్యతిరేకించారు. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులపైనా గవర్నర్, ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సచివాలయ ప్రారంభోత్సవానికి గవర్నర్ గైర్హాజరయ్యారు.

## 2024 ఎన్నికల్లో బీజేపీకి భంగపాటు తప్పదు : మమతా బెనర్జీ

కోల్‌కతా, మే2: 2024 సార్వత్రిక ఎన్నికల్లో మార్పు ఖాయమని పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ (ఓజీఎజీబిజీ ःజీనివతీతీవవ) అన్నారు. గత పదేండ్లుగా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు.

కేంద్రంలో కాషాయ సర్కార్ చరిత్రను మార్చడం, ఎన్ఆర్‌సీ పేరుతో అన్యాయం చేయడం మినహా మోదీ సర్కార్ ప్రజల కోసం పాటుపడిందేమీ లేదని దీదీ దుయ్యబట్టారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి బీజేపీ సర్కార్‌ను నిలువరించాలని కోరారు.

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ మట్టికరుస్తుందని అన్నారు. విపక్షాలు ఏకమైతే బీజేపీ ఓటమిపాలవుతుందని, విభజిత శక్తులపై భారత్ విజయం సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మతాల మధ్య చిచ్చు రేపుతున్న బీజేపీ కుయుక్తులను ఎండగడుతూ ప్రజలంతా ఏకం కావాలని దీదీ పిలుపు ఇచ్చారు.

## మే 6,7న 'శ్రీ వేంకటేశ తాపిన్యుపనిషత్' అంశంపై బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మగారి ప్రసంగం

ప్రముఖ ఉపాసకులు వేద వేదాంత విషయ సమన్వయ చక్రవర్తి 'బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ" గారు అనేక మార్లు ఉపన్యాసములు ఇచ్చి ప్రజలలో భక్తిని పెంపొందిస్తున్నారు. ఇదే పద్ధతిలో శ్రీ శర్మగారు "శ్రీ వేంకటేశ తాపిన్యుపనిషత్" అనే అంశంపై హైదరాబాద్‌లో కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణమునందు మే 6,7 తేదీలలో సాయంత్రం 6.30 నుండి 8.30 వరకు ప్రవచనాలు ఉపన్యాస పరంపర చేయనున్నారు.

"శ్రీ వేంకటేశ తాపిన్యుపనిషత్"లోని అంశాలు భక్తి పూరితమైనవే గాక ఆధ్యాత్మికోన్నతికి తోడ్పడతాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా మనవి.

– భక్త బృందం

# ఖమ్మం లకారంలో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ

## – జూనియర్ ఎన్టీఆర్‌ను కలిసి ప్రారంభ ఏర్పాట్లపై చర్చించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



ఖమ్మం, మే2: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం లకారం ట్యాంక్ బండ్‌పై విశ్వ విఖ్యాత నట సార్వభౌమ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 54 అడుగుల భారీ విగ్రహ ఆవిష్కరణకు సన్నాహాలు వేగంగా సాగుతున్నాయి. ఎన్.టీ. రామారావు శత జయంతి సందర్భంగా రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో కలిసి మే 28న తెలుగు సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ ఆవిష్కరణ చేయనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి విగ్రహావిష్కరణ ప్రారంభానికి సంబంధించి ఏర్పాట్లపై మంత్రి చర్చించారు. ఈ నేపథ్యంలో మే 28న శ్రీకృష్ణుని అవతారంలో ఏర్పాటు చేయనున్న ఎన్టీఆర్ విగ్రహం ఎ ం ్య ట క ్ ల న ం ఆకర్షించనుంది. ఇప్పటికే విగ్రహం తయారు పూర్తయి, విగ్రహ తరలింపుకు రంగం సిద్ధమైంది, మే 28న పండుగ వాతావరణంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ నందు ఎన్టీఆర్ భారీ విగ్రహ ఆవిష్కరణను చేయనున్నారు. బేస్‌మెంట్‌తో కలిపి 54 అడుగులు ఎత్తు ఉండే ఈ విగ్రహంలో తల భాగం ఐదు అడుగులు,కాళ్ల భాగం ఐదు అడుగులు ఇంకా మొత్తం శరీర భాగం ఎత్తు మాత్రమే 45 అడుగులుగా ఉండనుంది. ఎటు చూసినా 36 అడుగుల పొడవు వెడల్పులతో వెయ్యి అడుగుల విస్తీర్ణం ఉండే బేస్‌మెంట్? పైన ఈ విగ్రహాన్ని అమర్చనున్నారు. రూ. 2.3 కోట్ల వ్యయంతో ఈ విగ్రహం ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులను పొందడంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చొరవ చూపారు. విగ్రహ నిర్మాణంకు కావాలసిన నిధులను మంత్రి పువ్వాడ అజయ్ కుమార్,తానా సభ్యులతో పాటు పలువురు పారిశ్రామికవేత్తలు,వ్యాపారవేత్తలు, ఎన్నారైలు సహకరిస్తున్నారు. ఎన్టీఆర్ అభిమానులు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

# హెలికాప్టర్‌ను ఢీకొట్టిన డేగ

## –కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు తృటిలో తపిన ప్రమాదం

బెంగళూరు మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, సీనియర్ రాజకీయ నాయకుడు డీకే శివకుమార్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను డేగ ఢీకొట్టింది. దాంతో హెలికాప్టర్ అద్దం ఒకవైపు పూర్తిగా పగిలిపోయింది. హెలికాప్టర్ ల్యాండ్ అవుతున్న సమయంలో ఈ ఘటన జరగడంతో పెద్దగా ఎవరికీ ఏమీ కాలేదు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో డీకే శివకుమార్ ములబగిలులో ఎన్నికల ప్రచారం కోసం ఇవాళ మధ్యాహ్నం హెలికాప్టర్‌లో బయలు దేరారు. ఆ హెలికాప్టర్ హోసకోట్ సమీపంలో ల్యాండ్ అవుతుండగా డేగ వచ్చి ఢీకొట్టింది. దాంతో హెలికాప్టర్ అద్దం పగిలిపోయింది. దాంతో హెలికాప్టర్‌లో ఉన్న డీకే శివకుమార్‌కు ఏమీ కాకపోయినా, ఆయన కెమెరామెన్‌కు మాత్రం స్వల్ప గాయాలయ్యాయి.

# పారిశుద్ధ్య కార్మికులకు తప్పని నిరాశ

## – మాటలు తప్ప చేతకాని ప్రభుత్వం

## – సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్

ఖమ్మం, మే2: (నేటినిజం ప్రతినిధి): గ్రామపంచాయితీ పారిశుద్ధ్య కార్మికులను అన్యాయం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పెద్దమునగాల గ్రామ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

ఈ సందర్భంగా పరికపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ..బిఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులను చిన్నచూపు చూస్తుందని తీవ్రంగా విమర్శించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు మురికిని శుభ్రం చేస్తూ డ్రైనేజ్ లు చెత్త సేకరణ కరోనా టైంలో వారు ఏనలేని సేవలు అందించారని వారికి వేతనం కంటితుడుపుగా వెయ్యి రూపాయలు పెంచడం చాలా బాధాకరమని ఈ ప్రభుత్వం కార్మికులకు కర్షకులకు అన్యాయం చేస్తుందని వారి పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే గ్రామపంచాయతీ కార్మికుల పట్ల శ్రద్ధ వహించి వేతనం 18వేల రూపాయలను ఇవ్వలని డిమాండ్ చేశారు. మీరు మీ ప్రభుత్వం గురించి ప్రగల్బాలు గొప్పలు చెప్పుకుంటున్నారు. మీ గొప్పల కోసం 1200 కోట్లు ఖర్చుచేసి సచివాలయం నిర్మించారని మొక్కజొన్న రైతులకు ఏకరానికి 10వేల రూపాయలు గంటలో రైతుల ఖాతాలో జమ చేస్తామని చెప్పి ఇంతవరకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదని రైతులకు రుణమాఫీ చేస్తామని ఆ ఉసే లేదని అదీ మర్చిపోయారని ప్రభుత్వము వచ్చి ఏనిమిది సంవత్సరాలయినా పేదవాడి ఆశలు కలలుగానే మిగిలిపోయాయని పేదవాడికి ఇల్లులు ఇంతవరకు ఇవ్వలేక పోయారని ప్రజలందరూ బిఆర్ఎస్ పార్టీని కెసిఆర్ ని నమ్మే పరిస్థితిలో లేరని ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని ఘాటుగా విమర్శించారు.

# అంగరంగ వైభవంగా ప్రారంభమయిన లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవాలు



యాదగిరిగుట్ట మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవాలు యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం వరకు మూడు రోజుల పాటు జరిగే వేడుకలకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు స్వస్తివాచనం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు. జయంత్యుత్సవాల్లో భాగంగా సాయంత్రం 6:00 గంటలకు అంకురార్పణ, రుత్విగ్వరణం, హవనం నిర్వహించి గరుడ వాహనంపై పరవాసుదేవ అలంకార సేవను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఈ నెల 2 నుంచి 4 వరకు సుదర్శన నారసింహహోమం, నిత్య, శాశ్వత తిరు కల్యాణోత్సవాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రధానాలయంలోని ఉత్తర రాజగోపురం వెలుపలి ప్రాకార మండపంలో యాగశాల ఏర్పాటు చేశారు. 3న 9 గంటలకు నిత్యమూలమంత్ర హవనం, కాళీయ మర్ధన అలంకార సేవలో స్వామివారిని తిరుమాఢవీధుల్లో ఊరేగించనున్నారు. 10:30 గంటలకు లక్ష పుష్పార్చనలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు నృసింహ మూలమంత్ర హవనం, హనుమంత వాహనంపై రామావతారం అలంకార సేవ ఉంటుంది. 4న 7 గంటలకు మూలమస్త్ర హవనం, ఉదయం 9.00 గంటల నుంచి 9.30 గంటల వరకు పూర్ణాహుతి అనంతరం సహస్ర కలశాభిషేకం, సాయంత్రం 7 గంటలకు నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం, మహానివేదన, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించనున్నారు.

# గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించుకుందాం- భూమన



తిరుపతి, మే2: గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించుకుందామని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. జాతరలో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో భూమన కరుణాకర రెడ్డి నేతృత్వంలో గంగమ్మ తల్లి విగ్రహాలను ప్రతిష్టించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక లక్ష్మీపురం సర్కిల్, టీవీఎస్ షోరూం సర్కిల్, అన్నమయ్య సర్కిల్, ముత్యాల రెడ్డిపల్లి, వైకుంఠపురంకూడలి, రాళ్లపల్లి విగ్రహం, బాలాజీ కాలనీ, కృష్ణాపురం ఠాణా, నాలుగ్గాళ్ల మండపం, అశోక్ నగర్, సుందరయ్యనగర్, అన్నారావుసర్కిల్, సుభాష్.నగర్, కాటన్.మిల్, ఆటో నగర్ కూడళ్లలో ఈ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ? అంగరంగ వైభవంగా జరగనున్న గంగమ్మ తల్లి జాతరలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. జాతరను ఘనంగా నిర్వహించుకుందామని, వేషాలు వేసి, అమ్మ వారి ఆశీస్సులు పొందుదామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, పాలక మండలి సభ్యులు, వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతర నిర్వహణ కోసం తిరుపతి మత్స్యశాఖ అధికారులు తమ వంతుగా పదివేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డిని పద్మావతి పురంలోని వారి నివాసం వద్ద కలుసుకుని చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖకు చెందిన రాజేష్ రెడ్డి, సుమంత్, వెంకట రమణ పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు కమాండ్ కంట్రోల్ ఒక దిక్సూచి: డీఐజీ అమ్మిరెడ్డి

తిరుపతి, మే2:శాంతి భద్రతల పరిరక్షణకు కమాండ్ కంట్రోల్ ఒక దిక్సూచి అని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. మంగళవారం పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్, సైబర్ ల్యాబ్ ను పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని, వారి విధులను తెలుసుకోవడంతో పాటు ప్రస్తుత పరిస్థితులపై జాగ్రత్తలు, నైపుణ్యాన్ని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా అమ్మిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో సైబర్ క్రైమ్ నేరాలు వలన ఎందరో అమాయక ప్రజలు, యువత మోసపోతున్నారని.. రోజు రోజుకి కొత్త కొత్త నేరాలు చేస్తూ సైబర్ నేరగాళ్ల మోసం చేస్తున్నారని తెలిపారు. వాటికి అనుగుణంగా పోలీసులు కూడా నైపుణ్యం పెంచుకుని అందుబాటులో ఉన్నటువంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు కృషి చేయాలని కోరారు.

# కర్నూలులో ఏసీబీ అధికారుల తనిఖీలు

అమరావతి, మే2:కర్నూలు సిటీలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. కో ఆపరేటివ్ శాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్ ఇంట్లో సోదాలు చేస్తున్నారు. అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారన్న సమాచారంతో కర్నూలు కో ఆపరేటివ్ శాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్ గా పనిచేస్తున్న సుజాత ఇంట్లో ఈరోజు ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. కృష్ణనగర్ లోని కో ఆపరేటివ్ బ్రాంచ్ నందు డిప్యూటీ రిజిస్ట్రార్ సుజాత విధులు నిర్వహిస్తున్నారు. కర్నూలు సిటీలోని శ్రీరామ నగర్ నాగులకట్ట సమీపంలోని ఆమె ఇంట్లో ఉదయం 11 గంటల నుండి సోదాలు కొనసాగుతున్నాయి. ఏసీబీ డి.ఎస్.పి శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

# కస్తూరిబా పాఠశాల టీచర్లను కాంట్రాక్టు టీచర్స్‌గా విధుల్లోకి తీసుకోవాలి

## – విద్యాశాఖ మంత్రి కార్యాలయం ముట్టడించిన వందలాది మంది టీచర్లు



హైదరాబాద్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 937 మంది కస్తూరిబా పాఠశాల టీచర్లను కాంట్రాక్టు టీచర్స్‌గా విధుల్లోకి తీసుకోవాలని వందలాది మంది టీచర్లు నేడు విద్యాశాఖ మంత్రి కార్యాలయం ముట్టడించారు. ఈ ముట్టడికి వివిధ జిల్లాల నుండి పెద్ద యెత్తున టీచర్స్ కదలివచ్చారు. ఈ ఉద్యమానికి నిరుద్యోగ జాక్ ఛైర్మన్ నీల వెంకటేష్, నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు ఆర్.క్రిష్ణయ్య ముఖ్య అతిధిగా పాల్గొన్నారు..అనంతరం టిచర్ల నుద్దేశించి ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ రాష్ట్రంలో వివిధ జిల్లాలలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో 17.11.2021 న నిబంధనల మేరకు కాంట్రాక్ట పద్ధతిన నియమించబడిన 937 మంది టీచర్సు రెండు సంవత్సరాలుగా చిత్తశుద్ధితో ఇతర సిబ్బందితో సహా విధి నిర్వహణ నిర్వహిస్తున్నారు. హఠాత్తుగా వీరిని 09.03.2022న పిఇటి లను 23.04.2022 న పిజి టీచర్స్ ను, స్కూల్ టీచర్స్ ను అధికారులు విధులకు హాజరు కావద్దని మౌఖికంగా ఆదేశాలు జారీ చేయడం అన్యాయమన్నారు.

ఇప్పటికే కస్తూరిబా పాఠశాలలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయినిలతో సమానంగా వేతనం రెగ్యులర్ గా ఇస్తామని నియామకం చేసి ఇప్పుడు వేతనం చెల్లించకుండానే మౌఖిక ఆదేశాలతో తొలగించారు. "సమాన పనికి సమాన వేతనం" అన్న సుప్రీంకోర్టు తీర్పు నిబంధన ప్రకారం వీరికి కనీసం చేసిన పనిదినములకు సరియగు వేతనం చెల్లించలేదు. జనవరి నెలలోమేము లినీతీని టతీనీఎ ఫ్ట్రనీఎవ టబీబితివబ ఉ టజీఎ ఎఎ టజీఎ టబీబితివబ కూడా చేసిన వీరికి కేవలం 7 రోజులకు మాత్రమే వేతనం చెల్లించారని,అయితే పని చేస్తున్న తాత్కాలిక పోస్టుల్లో మళ్లీ తాత్కాలిక ఉద్యోగులను నియమించవద్దని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నాయి.

కావున గత నవంబర్ నుండి పని చేస్తున్న 937 టిచర్లను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం మాట్లాడుతూ ఈ పోస్టులో కొత్తవారిని నియామకం నిబంధనలకు విరుద్ధము. సుప్రీంకోర్టు తీర్పుకు ప్రకారం పాత వారినే కొనసాగించాలని,వీరిని తొలగించి కొత్త వారిని నియమిస్తే సుప్రీంకోర్టు తీర్పును దిక్కరించడవే అవుతుందన్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి గారు "మన ఊరు మన – బడి పథకం" కింద ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, విద్యా ప్రమాణాలు పెంచడానికి 7200 కోట్లు ప్రత్యేకంగా కేటాయించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యా ప్రమాణాలు గల విద్య పేద వర్గాలకు ఇవ్వడానికి ముఖ్యమంత్రి గారు శ్రద్ధ తీసుకుంటునీటే విద్యా శాఖా అధికారులు టీచర్లను తొలగించుకుంటూ విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేయుడం తగదన్నారు. మానవతా దృక్పథంతో పరిశీలించి విద్యార్థుల విద్యా బోధనకై నవంబర్ 2021 లో నియామకం చేయబడిన 937 మంది కుటుంబాలకు భద్రత కల్పిస్తూ ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టు ఉపాధ్యాయినిల మాదిరిగా కొనసాగిస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. ఈ ముట్టడిలో లో గుజ్జ సత్యం, నీల వెంకటేష్, నాని ముదిరాజ్, బోల్క వెంకట్ యాదవ్ వేముల రామ కృష్ణ, ఎమ్. పృథ్వీ గౌడ్, , మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.


విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్
ఎలకుర్రు



ఆహ్వానము
విశ్వదాత అవార్డుల ప్రదానోత్సవ సభ
విశ్వదాత అవార్డులు 2023

వేదిక : భ్రమరాంబ చెన్నమల్లికార్జున స్వామి వారి కళావేదిక, ఎలకుర్రు, పామర్రు మండలం
తేది : 03-05-2023 బుధవారం
సమయం : రాత్రి 7-00 గంటలకు

సభాధ్యక్షులు :
శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు,
కార్యదర్శి, విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్

ముఖ్యఅతిథి :
శ్రీ కైలే అనిల్ కుమార్
శాసన సభ్యులు , పామర్రు

ఆత్మీయ అతిథి :
డా. జి.వి.పూర్ణచంద్
కార్యదర్శి, కృష్ణాజిల్లా రచయితల సంఘం

అవార్డు గ్రహీతలు :
డా. శ్రీ రాధశ్రీ, ప్రముఖ కవి, హైదరాబాద్
శ్రీ చెన్నాప్రగడ వెంకట నాగ సత్యనారాయణశర్మ, ప్రముఖ జర్నలిస్ట్, విజయవాడ
శ్రీ పొన్నాడ సత్యప్రకాశరావు, కథా రచయిత, విజయవాడ
డా. శ్రీ బి.కిరణ్‌పాల్, ప్రముఖ సంఘ సేవకులు, మచిలీపట్నం
శ్రీ పసుమర్తి వేంకటేశ్వర శర్మ, కూచిపూడి నాట్యాచార్యులు, హైదరాబాద్

సభానాంతరం శ్యామలా ధర్మ ప్రాథమికోన్నత పాఠశాల, కెడిబి దివ్యాంగుల పాఠశాల విద్యార్థుల నాట్య ప్రదర్శనలు కలవు.

ఇట్లు :
ఆహ్వాన కమిటి


# అధిష్టానం రాయ'భారం'- అలక వీడని బాలినేని

అమరావతి, మే2: ఇటీవల పార్టీ ప్రాంతీయ సమ న్వయకర్త పదవికి రాజీనామా చేసిన మాజీ మంత్రి, ఒంగోలు శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యవహారం చిలికి చిలికి గాలివానగా మారుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే మంత్రి పదవి ఇవ్వలేదన్న కారణంతో అలిగిన బాలినేనిని పార్టీ పెద్దలు సముదాయించి సీఎం జగన్‌తో మాట్లాడించి శాంతింపజేశా రు. ఇప్పుడు ఆయన తన ప్రాంతీయ సమన్వయకర్త పదవికి అనూహ్యంగా రాజీనామా చేసి మరోమారు వార్తల్లోకెక్కారు. బాలినేని నుండి వచ్చిన ఊహించని ఈ పరిణామంతో అధిష్టా నం ఆశ్చర్యానికి గురైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాతోపాటు ఇరుగుపొరుగు జిల్లాల్లో ఆయనకు మంచి పట్టు ఉంది. దీంతో ఆయన్ను బుజ్జగించి శాంతింపజేసేందుకు అధిష్టాన పెద్దలు రంగంలోకి దిగారు. ఈక్రమంలోనే అధిష్టానం నుండి ఆయనతో రాయ'భారం' సాగిస్తోంది. పార్టీ తరపునుండి ఇద్దరు పెద్దలు ఆయనతో మంతనాలు జరుపుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే ఆయనతో రెండు, మూడు దఫాలుగా చర్చలు జరిపారని, త్వరలోనే మరోమారు భేటీ జరిగే అవకాశముందని చెబుతున్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డితో కూడా భేటీ ఏర్పాటు చేసేందుకు అధిష్టానం నిర్ణయించిందని తెలుస్తోంది. అయినప్పటికీ ఆయన మాత్రం తన అలక వీడేట్టు కనిపించడం లేనట్లు కనిపిస్తోంది. దీంతో ప్రాంతీయ సమన్వయకర్త పదవికి రాజీనామాపై డైలమా కొనసాగుతోంది. తాను పార్టీ కార్యక్రమాలకు దూరం కావటం లేదని.. కేవలం రీజనల్ కో ఆర్డినేటర్ బాధ్యతల నుండి మాత్రమే తప్పుకుంటున్నట్లు– బాలినేని పార్టీ పెద్దలకు స్పష్టం చేస్తున్నారని తెలుస్తోంది. ఈనేపథ్యంలోనే సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బాలినేనికి ఫోన్ వెళ్లినట్లు సమాచారం. కానీ, బాలినేని తన ఆలోచన మార్చుకోవటానికి సుముఖంగా లేరని తెలుస్తోంది.

అందుకే మనస్థాపానికి గురయ్యారా :

బాలినేని శ్రీనివాస రెడ్డి తిరుపతి, కడప, నెల్లూరు జిల్లాల కో–ఆర్డినేటర్ పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నానని పార్టీ ముఖ్య నేతలకు సమాచారం ఇచ్చారు. కొంత కాలంగా చోటు– చేసుకుంటు–న్న వరుస పరిణామాలే దీనికి కారణంగా భావిస్తున్నారు. జిల్లాలో ప్రాధాన్యత తగ్గించేలా చోటు– చేసుకుంటు–న్న వ్యవహారాలపై బాలినేని తీవ్ర మనస్థాపానికి గుర్రైనట్లు– తెలుస్తోంది. జిల్లాలో గతంలో ఇద్దరికి మంత్రి పదవి ఇచ్చారని, రెండో సారి కేబినెట్‌లో తనకు అవకాశం కల్పించాలని బాలినేని అప్పట్లో అధిష్టానినికి పలుమార్లు విన్నవించుకున్నారు. అలాకుంటే తనకు ప్రోటోకాల్ ఇబ్బందులు ఎదురవుతాయని, ప్రజలకు పని కూడా చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆయన సహేతుకమైన కరాణాలను అధిష్టానానికి వివరించారు. అయినప్పటికి సొంత మనిషే కదా..చెబితే వింటారన్న ఆలోచనతో అధిష్టానం ఆయనకు రెండో సారి కేబినెట్‌లో బెర్త్ ఇవ్వలేదు. దీంతో అప్పటి నుండి ఆయనకు ప్రోటోకాల్ ఇబ్బందులు ఎదురవుతూనే వస్తున్నాయి. అయినప్పటికీ ఆయన సర్దుకువస్తున్నారని, మొన్న మార్కాపురం ఘటన ఆయన్ను తీవ్ర మనస్థాపానికి గురిచేసిందని ఆయన వర్గీయులు చెప్పుకుంటున్నారు. దీనికి సంబంధించి బాలినేనిని బుజ్జగించేందుకు తాడేపల్లి నుంచి ఇద్దరు ముఖ్య నేతలు ప్రయత్నించినట్లు– సమాచారం. తన సొంత జిల్లాతో పాటు–గా, ఇంఛార్జ్ గా ఉన్న జిల్లాల్లో నేతలు చెప్పిన విషయాలను చేయలేకపోతున్నట్లు– బాలినేని ఆవేదనలో ఉన్నారని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

## జగన్‌తోనే ఉంటానంటూ ?

ఇదే సమయంలో బాలినేని తాను జగన్ కోసం పని చేస్తానని స్పష్టం చేస్తున్నారు. ప్రాంతీయ సమన్వయకర్త పదవి వదులుకోవటానికి అనేక కారణాలు ఉన్నాయని చెప్పినట్లు– తెలుస్తోంది. తన సొంత నియోజకవర్గంతో పాటు–గా పార్టీ కోసం పని చేస్తానని జిల్లా నేతలతో వెల్లడించారు. ఇక నుంచి పూర్తి సమయం ఒంగోలు నియోజకవర్గానికి కేటాయిస్తానని చెప్పుకొచ్చారు. స్వల్ప అస్వస్థతకు గురైన బాలినేని మరో రెండు రోజుల్లో ఒంగోలు వస్తానని చెప్పినట్లు– తెలుస్తోంది. పార్టీ కార్యక్రమాల్లోనూ యధావిధిగా పాల్గొంటానని క్లారిటీ– ఇచ్చారు. కానీ, పార్టీ ఎన్నికలకు సిద్ధం అవుతున్న తరుణంలో కీలక బాధ్యతల నుంచి ముఖ్యమంత్రి నమ్మకం పెట్టు–కున్న బాలినేని వంటి నేతలు ఇలాంటి నిర్ణయాలు ఏంటనే చర్చ పార్టీలో వినిపిస్తోంది.

## సీఎంతో భేటీ–కి ఛాన్స్ :

ఇదిలావుండగా, సీఎంతో బాలినేని సమావేశం అయ్యే అవకాశం కనిపిస్తోంది. తాజా పరిస్థితులపై బాలినేని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి వివరించనున్నారని తెలుస్తోంది. బాలినేనికి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గతం కంటే ప్రాధాన్యత తగ్గిందనే అభిప్రాయ వ్యక్తం అవుతోంది. కొద్ది రోజుల క్రితం జరిగిన సమన్వయకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి ఎప్పుడైనా తనను కలవచ్చని స్పష్టం చేసారు. పార్టీలో సమస్యలను పరిష్కారానికి చొరవ చూపించాలని నిర్దేశించారు. ఇప్పుడు పార్టీలో కీలకంగా ఉన్న బాలినేని సీఎంతో సమావేశ సమయంలో ఏం చెబుతారు, సీఎం ఎలా రియాక్ట్ అవుతారనేది ఆసక్తికరంగా మారుతోంది.

# మాజీ లోక్ సభ స్పీకర్ మీరా కుమార్‌ను కలిసిన ఐపిసి అధ్యక్షులు శ్రీధర్



హైదరాబాదు మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);హైదరాబాదు బేగంపేట్ లోని టూరిజం ప్లాజాలో మాజీ లోక్ సభ స్పీకర్ మీరా కుమార్ తల్లి ఇంద్రాణి జగ్జీవన్ రావ్ బాబు జగ్జీవన్ రామ్ సతీమణి స్వయంగా రాసిన 'జ్ఞాపకాలు' పుస్తక తెలుగు అనువాద పత్రిక ఆవిష్కరణ సందర్భంగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబి శ్రీధర్ ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు తదితరులు మీరాకుమార్ మరియు వారి కుమారుడు డాక్టర్ అన్సుల్ అజిత్ జాతీయ అధికార ప్రతినిధి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఏఐసిసి నీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాజేందర్ యాదవ్ పిసిసి సెక్రెటరీ కూడా పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



ఖమ్మం, మే2: (నేటినిజం ప్రతినిధి): నగర బీఆర్టీయూ అధ్యక్షుడు బుర్రి వినయ్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికుల వేతనాలు పెంచిననీదుకు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ క్యాంప్ కార్యాలయంలో సీఎం కేసిఆర్ చిత్రపటానికి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి అజయ్ కుమార్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ పునుకొల్లు నీరజ,సుడా ఛైర్మెన్ విజయకుమార్,నగర బీఅర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజులు ముఖ్యఅతిధులుగా హాజరై మాట్లాడుతూ..కార్మికుల పక్షపాతి సీఎం కేసిఆర్ 2014లో రూ.8000 వెలు వున్న మునిసిపల్ కార్మికుల వేతనాలను తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ఏర్పడ్డాక 13500 వేలకు పెం చారన్నారు.అదే విధంగా నూతనంగా నిర్మించిన సచివాలయానికి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సచివాల యంగా నామ కరణం చేసిన రోజే మరోసారి కార్మికుల వేతనాలను రూ.1000 పెంచుతూ తొలి సంతకం చేశారన్నారు. మరొకసారి కెసిఆర్ కార్మికుల పక్షపాతిగా నిలిచారని ముచ్చటగా మూడోసారి కూడా కేసీఆర్ అధికారంలోకి వస్తారన్నారు.కార్మికుల వేతనాలు పెంచినందుకు సీఎం కేసిఆర్ కు, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు కార్మికుల పక్షాన వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమ ంలో కిరణ్, తిరుమలరెడ్ ,జ్యోతి, వెంకటేష్,రవి, ఉపేందర్, సత్య, సునీత,మం గమ్మ, లక్ష్మీనారాయణ, కృష్ణ, నాగమణి, సులోచన, రాధ,లక్ష్మి పాల్గొన్నారు.

# పాస్‌పోర్టులో తండ్రి పేరును తొలగించండి..!

## – ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు..

న్యూఢిల్లీ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: దేశ రాజధాని ఢిల్లీ హైకోర్టు తాజాగా ఓ సంచలన తీర్పును వెల్లడించింది. తన కుమారుడి పాస్‌పోర్టు విషయమై ఓ ఒంటరి తల్లి వేసిన పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం.. ఆమెకు అనుకూలంగా కీలక తీర్పు ఇచ్చింది. పుట్టక ముందే కుమారుడిని వదిలిపెట్టి వెళ్లిపోయిన తండ్రి పేరును పాస్‌పోర్టులో చేర్చాల్సిన అవసరం లేదని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. ఆమె మైనర్ కుమారుడి పాస్‌పోర్టులో వెంటనే తండ్రి పేరును తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. పాస్‌పోర్ట్ మాన్యువల్ 2020 దీనికి సంబంధించిన పలు షరతులను స్పష్టంగా పేర్కొన్నందున మైనర్ బాలుడి పాస్‌పోర్టులో అతడి తండ్రి పేరు ఉండాల్సిన అవసరం లేదంటూ జస్టిస్ ప్రతిభా ఎం సింగ్ తీర్పు ఇచ్చారు.

తాను ఒంటరి తల్లి అయినందున తన కుమారుడి పాస్‌పోర్టు నుంచి అతడి తండ్రి పేరును తొలగించాలని ఓ మహిళ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. తన కొడుకు పుట్టక ముందే అతడి తండ్రి వదిలి వెళ్లిపోయాడని తన పిటిషన్‌లో ఆమె పేర్కొన్నారు. దాంతో తాను ఒంటరిగా తన కుమారుడిని పెంచానని, తన కొడుకు పాన్ పోర్టులో తండ్రి పేరును తొలగించి కొత్తది ఇవ్వాలని ఆమె కోరారు. ఈ పిటిషన్‌ను సోమవారం పరిశీలించిన జస్టిస్ ప్రతిభా ఎం సింగ్.. "తండ్రి బిడ్డను పూర్తిగా వదిలిపెట్టిన కేసు ఇది. మైనర్ కుమారుడి పాస్‌పోర్టులో నుంచి తండ్రి పేరును తొలగించి కొత్తది జారీ చేయాలని పాస్‌పోర్టు అధికారులను ఆదేశిస్తున్నాం. ఇలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో తండ్రి పేరును తొలగించడంతో పాటు ఇంటిపేరునూ సైతం మార్చుకునే వెసులుబాటు ఉంది" అంటూ తీర్పును వెల్లడించారు.

# బాల్య వివాహాలను అరికట్టండి.. డీఐజీ అమ్మిరెడ్డి



తిరుపతి, మే2:బాల్య వివాహాలను అరికట్టాలని, అలాగే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని మహిళా పోలీసులకు అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. మంగళవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జిల్లావ్యాప్తంగా మహిళా పోలీసులతో వారి పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మిరెడ్డి మాట్లాడుతూ.. పోలీసుల పనితీరుపై సబ్ డివిజన్ వారీగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని వివరించారు. మహిళా పోలీసుల పరిధిలో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. నేరానికి సంబంధించి ముందు సమాచారాన్ని సేకరించి ఆ గ్రామ పరిధిలో జరుగుతున్నటువంటి కార్యక్రమాల పై ఎస్ .హెచ్. ఓ. దృష్టికి సమాచారాన్ని తీసుకుని వచ్చి నేర నివారణలో భాగస్వాములు కావాలని తెలియజేశారు. నేటితరం పోలీస్ కానిస్టేబుల్ వద్ద అపారమైన జ్ఞానం, తెలివితేటలు ఉన్నాయని, వారి తెలివితేటలను పూర్తిగా ఉపయోగించుకుని, బీట్ వ్యవస్థను దర్యాప్తు చేసే పద్ధతిలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మహిళా పోలీసుల సేవలు శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా పనిచేయాలని తెలిపారు. అలాగే మహిళా పోలీసులు వారి వారి పరిధిలో విస్తృతంగా పర్యటించి ప్రజలతో సమావేశమై ఎల్. హెచ్. ఎం. ఎస్. తో పాటు సైబర్ సెక్యూరిటీ, దిశా యాప్, మొబైల్ హంట్ అప్లికేషన్, సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.అదేవిధంగా గృహహింస, వరకట్నం, లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్, సామాజిక దురాచారాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాన్ని చేపట్టాలని తెలియజేశారు. అంగన్వాడీ, పాఠశాలలు కళాశాలలో హాస్టల్లో సందర్శించి నేటి సమాజంలో మహిళలపై ఎక్కువగా జరుగుతున్న నేరాలైన గుడ్ టచ్, బ్యాడ్ టచ్. ఫోక్సో చట్టం, ప్రేమ వలయాల్లో పడి పారిపోవడం, సోషల్ మీడియా మోసాలపై రహదారిలో భద్రత, వీటన్నింటిపై కనీస అవగాహన కార్యక్రమం ఉండేవిధంగా మహిళా పోలీసులు చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ప్రతినెలా నేర సమీక్ష సమావేశంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా పోలీసులకు తగిన అవార్డులు, రివార్డులతో పాటు ప్రోత్సాహాలను కూడా అందించడంతో పాటు అభినందించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. వేసవి సెలవుల కారణంగా ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రలకు విహారయాత్రలకు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇటీవల కాలంలో నిరుద్యోగ యువత ఎక్కువగా అతి తక్కువ కాలంలోనే ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఆ తర్వాత నేర ప్రవృత్తికి అలవాటు పడటంతో పాటు చెడు వ్యసనాలకు బానిసవుతూ ఉంటారన్నారు. అలాంటి యువకులను గుర్తించి ఎస్.హెచ్.ఓ. లు కౌన్సిలింగ్ ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ కులశేఖర్, క్రైమ్ అదనపు ఎస్పీ విమల కుమారి, దిశ పోలీస్ డీఎస్పీ రామరాజు, డీఎస్పీలు సురేందర్ రెడ్డి, నరసప్ప, సీఐలు రామకృష్ణ చారి, సురేందర్ రెడ్డి, రవీంద్రనాథ్, జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

## –మే 6న ఇందిరా పార్క్ వద్ద రజక మహా ధర్నా

హైదరాబాద్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): రజకులను వెంటనే ఎస్సి జాబితాలో చేర్చాలన్న ప్రదాన డిమాండ్ తోఅఖిల భారత రజక సంఘం ఆద్వర్యం లో ఈ నెల 6 న ఇదిరా పార్క్ వద్ద మహా ధర్నాను నిర్వహిస్తున్నట్లు అఖిల భారత రజక సంఘం అద్యక్షులు మొగ్గ అనిల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం బిసి భవన్ లో రాజ్యసభ సబ్యులు, బిసి సంఘం జాతీయ అద్యక్షులు ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా మహా ధర్నా పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ రజకుల పట్ల తెలంగాణా ప్రభుత్వం నిర్లక్ష్యం, సవతి తల్లి ప్రేమను కనబర్చుతుందని విమర్శించారు. రాష్ట్రము లోని రజకులకు వెంటనే కార్పోరేషన్ ను ఏర్పాటు చేయాలని, దళితులకు ఇచ్చిన మాదిర్గా రజకులకు రజక బందు వెంటనే ఇవ్వాలని, ట్యాంక్ బండ్ పై తెలంగాణా పోరాట యోదురారు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించాలని,జనగామ జిల్లాకు రజక ఐలమ్మ పేరు పెట్టాలని, రాజకుల కోసం ప్రత్యేక బర్జెట్ ను కేటాయించాలన్న మొదలగు డిమాండ్లతో ఈ మహా ధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో అఖిల భారత రజక సంఘం రాష్ట్ర అద్యక్షులు దాసారం సతీష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేతురి రవి, ఉపాద్యక్షులు అకిన పల్లి గణేష్, రాష్ట్ర నాయకులు పోసాల సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేగా పాలేరు నుంచి షర్మిల పోటీ !

హైదరాబాద్ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);వైఎస్ షర్మిల స్థాపించిన వైఎస్సార్‌టీపీ తెలంగాణలో ఇంకా బలపడకపోవచ్చు! ఆ పార్టీకి పెద్ద సంఖ్యలో కేడర్ లేకపోవచ్చు! కానీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపి ఎండగట్టే విషయంలో ఆ పార్టీ ఎప్పుడూ క్రియాశీలకంగానే ఉంటోంది. పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల క్షేత్రస్థాయిలోనే ఉంటూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగానే నిలదీస్తున్నారు. అరెస్టులను సైతం ఆమె లెక్కచేయడం లేదు. తద్వారా ఇక్కడి రాజకీయాల్లో బలపడాలనే తన ఆకాంక్షను చాటిచెబుతున్నారు. తెలంగాణలో వైఎస్సార్ సంక్షేమ పాలనే లక్ష్యమని చెబుతున్న షర్మిల ఈ సారి ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టాలని గట్టి పట్టుదలతో కనిపిస్తున్నారు. ఇందుకు ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గాన్ని ఆమె ఎంచుకున్నారు. ఇక్కడి నుంచే బరిలో దిగాలని భావిస్తున్నారు. ఇదే విషయంపై సోమవారం మరోసారి క్లారిటీ ఇచ్చారు. రెండు రోజుల పాలేరు నియోజకవర్గం పర్యటనలో ఉన్న ఆమె సోమవారం ఈ విషయాన్ని తెలిపారు. 'నేను పాలేరులోనే పోటీ చేస్తా.. ఎలాంటి అపోహలు అవసరం లేదు' అని అన్నారు. మరి షర్మిల పాలేరు నియోజకవర్గాన్నే ఎంచుకోవడానికి కారణం ఏంటి?. ఇక్కడి నుంచి పోటీ చేస్తే గెలుపు సులభమా? దీని వెనుక ఆమె వ్యూహాలు ఏమిటి? అనే ఆసక్తికర విషయాలను ఒకసారి పరిశీలిద్దాం...

పాలేరుపై గురి ఇందుకేనా...

వైఎస్ షర్మిల చాలా వ్యూహాత్మకంగానే పాలేరును ఎంచుకున్నారని టాక్ వినిపిస్తోంది. రాజకీయ చైతన్యం ఉందని పేరున్న ఈ నియోజకవర్గం నుంచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూతురిగా పోటీచేస్తే విజయావకాశాలు మెరుగవుతాయనేది షర్మిల ఆలోచన కావొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నియోజకవర్గంలో రెడ్డి సామాజిక వర్గం ఓటర్లు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. మరోవైపు ఇది జనరల్ స్థానమే అయినప్పటికీ గిరిజనులు అధికంగా ఉన్నారు. కాబట్టి గిరిజనుల్లో వైఎస్సార్‌కు ఉన్న ఆదరణను ఓట్లుగా మలుచుకోవడం సులభమని షర్మిల లెక్కలేస్తున్నట్టు రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ వైఎస్సార్ అభిమానులు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారని టాక్ ఉంది. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో సంక్షేమ పథకాలు పొందినవారు షర్మిలకు ఓట్లు వేయొచ్చనే చర్చ కూడా ఉంది.నిజానికి రాష్ట్ర విభజన తర్వాత 2014లో జరిగిన తొలి ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 3 ఎమ్మెల్యే సీట్లతోపాటు ఒక ఎంపీ సీటును గెలుచుకుంది. ఎన్నికల సమయంలో ఆ పార్టీ చీఫ్ జగన్మోహన్ రెడ్డి ఏపీపైనే ఫోకస్ పెట్టి తెలంగాణలో పార్టీని పట్టించుకోలేదు. అయినప్పటికీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆ పార్టీకి వచ్చిన ఫలితాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. దీంతో ఆ జిల్లాలో వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నారనే నమ్మకం ఏర్పడింది. మరోవైపు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ పార్టీకి ఏకపక్ష ఆదరణ లభించిన పరిస్థితులు కనిపించవు. కాంగ్రెస్, బీఆర్ఎస్, వామపక్ష పార్టీల తోపాటు టీడీపీకి కూడా ఇక్కడ మంచి ఓటు బ్యాంకు ఉంది. పాలేరు నియోజకవర్గంలో కూడా పార్టీలు సమవుజ్జీలుగా పోటీపడే అవకాశాలున్నాయి. కాబట్టి అన్ని పార్టీలు సమ బలంతో ఉన్న పరిస్థితులను సానుకూలంగా మార్చుకోవచ్చునేది షర్మిల అంచనా వ్యూహం అవ్వొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అయితే ఎన్నికల సమయంలో షర్మిలకు ఏ పార్టీ అయినా మద్దతు ఇస్తుందా?. లేదా ఒంటరిగానే బరిలో దిగుతారా?. ఆమె పోటీ చేస్తే ఏ పార్టీకి నష్టం అనేది మాత్రం ఎన్నికల సమయంలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. కాగా పాలేరు నియోజకవర్గంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందిన కందాల ఉపేందర్ రెడ్డి అధికార పార్టీలో చేరారు. దీంతో సీటు విషయంలో తనపై పోటీ చేసిన తుమ్మల నాగేశ్వరరావుతో పోటీ ఏర్పడినట్టయ్యింది. ఇక ఈ నియోజకవర్గాన్ని ఎక్కువసార్లు కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ ఎవరిని బరిలోకి దించుతుంది, వామపక్షాలు ఏం చేయబోతున్నాయి, పొత్తు–ఎత్తులు ఏవిధంగా ఉంటాయనేది వైఎస్ షర్మిల విజయావకాశాలపై ప్రభావం చూపే అవకాశాలుంటాయి. మరి షర్మిల ఇక్కడి నుంచి ఎమ్మెల్యే అవుతారా లేదా అనేది మాత్రం ఎన్నికల్లోనే తేలనుంది.

# అమ్మ చేతి ముద్ద ఎప్పుడూ అమృతమే

## -మన సంప్రదాయ వంటలే మనకు బలం

## -పాక ఇడ్లీ తిన్న వెంకయ్యానాయుడు.. అశ్చర్యపోయిన యజమాని

విజయవాడ మే 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : సంప్రదాయ వంటలనే ఆహారపు అలవాట్లుగా మార్చుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. నగరంలోని మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీ రాూూ ఇడ్లీ సెంటర్ (పాక ఇడ్లీ)లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు టిఫిన్ చేశారు. పిజ్జా, బర్గర్ల ద్వారా ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని చెప్పారు. యువతకు కూడా మన వంటకాల రుచులను చూపించి అలవాటు చేయాలన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలని ఆయన సూచించారు. అమ్మ చేతి ముద్ద ఎప్పుడూ అమృతమే నన్నారు. అలాగే మన సంప్రదాయ వంటలే మనకు బలమన్నారు. వ్యాయామం మనకి ఎంత ముఖ్యమో మన వంటలే తినడం అంతే ముఖ్యమని తెలిపారు. తాను ఎటువంటి రాజకీయ వ్యాఖ్యలు చేయనన్నారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావుతో కలిసి వెంకయ్య నాయుడు నేతి ఇడ్లీ తిన్నారు. ఈ ఇడ్లీ తినేందుకే గన్నవరం నుంచి ప్రత్యేకంగా వెంకయ్యానాయుడు విజయవాడ వచ్చారు. నాణ్యమైన ఇడ్లీ అందిస్తున్నారని హోటల్ యజమాని కృష్ణ ప్రసాద్‌ను ప్రత్యేకంగా ఆయన అభినందించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... పాక ఇడ్లీ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. గతంలో ఎప్పుడో ఒక్కసారి ఇక్కడ ఇడ్లీ తిన్నానని గుర్తుచేశారు. నాణ్యమైన ఇడ్లీ తినాలనిపించి ఇక్కడకు వచ్చానని పేర్కొన్నారు .అలాగే పాక ఇడ్లీ యజమాని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ... నలభై యేళ్లుగా ఇక్కడ ఇడ్లీ సెంటర్‌ను నడుపుతున్నామని తెలిపారు. "మా నాన్న. మల్లికార్జున రావు ఈ హోటల్‌ను స్థాపించారు. పాక ఇడ్లీగా ప్రసిద్ధి చెందడంతో ప్రముఖులు కూడా వస్తుంటారు. ఈరోజు వెంకయ్య నాయుడు తమ హోటల్‌లో టిఫిన్ చేయడం ఆనందంగా ఉంది. హఠాత్తుగా రావడంతో మేము కూడా ఆశ్చర్య పోయాం" అని పేర్కొన్నారు.

# ఈ కామర్స్‌కి నిలయంగా తెలంగాణ.. ఫ్లిప్ కార్డ్ ద్వారా 40 వేల మందికి ఉపాధి

హైదరాబాద్, మే2: దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఉపాధి కల్పనతో దేశాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. సంగారెడ్డిలో ఫ్లిప్ కార్డ్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో వర్చువల్ పద్ధతి ద్వారా మంగళవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

తెలంగాణలో ఇప్పుడు చేస్తున్నది రేపు యావత్ దేశం అనుసరిస్తుందని తెలిపారు. ఈ కామర్స్ రంగం వేగంగా దూసుకెళ్తోందని స్పష్టం చేశారు. సంగారెడ్డిలో ఫ్లిప్ కార్డ్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినందుకు ఆ యాజమాన్యానికి మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లిప్ కార్డ్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల మందికి ఉపాధి కల్పన లభిస్తుందని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక బృందాలు విజయవంతంగా పని చేస్తున్నాయని చెప్పారు.

ఉపాధి కల్పనలో మహిళలకు 50 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఫ్లిప్‌కార్డ్ సీఈవో కల్యాణ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఇది తెలంగాణలోనే అతి పెద్ద ఫెసిలిటీ సెంటర్ అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ఐటీ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# సమస్యల సుడిగుండంలో తెలంగాణ - సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



నల్గొండ, మే 1:సమస్యల సుడిగుండంలో తెలంగాణ రాష్ట్రం చిక్కుకున్నదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారంలో వైఫల్యం చెందాయని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం రాజపేట మండలం రఘునాథపురం గ్రామం నుంచి యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి మాసాయిపేట, సైదాపురం, మీదుగా యాదగిరిగుట్ట వరకు కొనసాగింది. ఈ సంధర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం తీసుకురావాలని పీపుల్స్ మార్చ్ పాదయాత్రను నోర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 47వ రోజు కొనసాగిన భట్టి చేపట్టిన పాదయాత్రకు అడుగడుగున ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గ్రామ గ్రామాన మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి వీర తిలకం దిద్దారు.

ప్రజలను కలుస్తూ నేరుగా వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ తన పాదయాత్రను ముందుకు కొనసాగించారు. రఘునాథపురం లోపవర్లూమ్ కార్మికుడు ఆడెం శివ పాదయాత్రకు ఎదురుగా వచ్చి తన ఇంట్లో పవర్ లూమ్స్ పైన తయారవుతున్న బట్టల గురించి వివరించారు. మరమగ్గం నడిపించే విధానాన్ని చూపించారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే నేత కార్మికులను ఆదుకుందని చెప్పారు. అప్పుడే నేత కార్మికులు వాడే మరమగ్గాలకు విద్యుత్ బిల్లులపై సబ్సిడీని ఇచ్చారని గుర్తు చేసుకున్నారు.

ప్రస్తుతం మాకు రైతులకు ఇచ్చినట్లుగా ఉచిత్ విద్యుత్ ఇవ్వాలని కోరారు. చేనేత వస్త్రాల కోసం కొనే ముడిసరుకులు, తయారైన వస్త్రాలపై రెండు విధాలుగా జీఎస్టీ వేయడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నాయని.. వాపోయారు. అంతేకాక ముడిసరుకు కొనుగులుపై సబ్సిడీ ఇవ్వాలని అడిగారు. ధనిక రాష్ట్రమైన ప్రత్యేక తెలంగాణ పాలనలో కన్నా.. నాటి ఉమ్మడి రాష్ట్ర కాంగ్రెస్ పాలనే బాగుందని చెప్పారు

మాసాయిపేటలోని ఐకెపి కేంద్రం వద్ద తడిసిన ధాన్యం చూపించి రైతులు కన్నీరు మున్నేరుగా విలపించారు. మా కష్టం చూడాలంటూ ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లారు. దాదాపు 10 రోజుల కింద కొనుగోలు కేంద్రం తెరిచినా .. ఇప్పటి వరకూ ఒక్క క్వింటా కూడా తూకం వేయలేదని రైతు కల్లెం మల్లయ్య కన్నీటిపర్యంతమవుతూ చెప్పారు. అకాల వర్షానికి ధాన్యం తడుసన్తూ.. ఎండబెడుతూ.. రాత్రింబవళ్లు కొనుగోలు కేంద్రం వద్దే పడిగాపులు కాస్తున్నట్లు కన్నీళ్లు పెట్టుకుంటూ చెప్పారు.

# ముజిగల్ కొంపల్లి శాఖను సందర్శించిన సరిగమప లిటిల్ ఛాంప్స్



హైదరాబాద్, మే2:హైదరాబాద్‌లో ప్రీమియర్ సంగీత అకాడమి ముజిగల్, కొంపల్లి శాఖను సరిగమప లిటిల్ ఛాంప్స్, తెలంగాణా అభ్యర్థులు సందర్శించారు. వీరిలో వాగ్దేవి, శశాంక్, శ్రావణి ఉండటంతో పాటుగా తమ అద్భుతమైన ప్రదర్శనలతో ఔత్సాహిక సంగీత కారులను సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తారు. అంతేకాకుండా ఇటీవల ట్రినిటీ పరీక్షలను పాస్ అయిన వారికి సర్టిఫికెట్లను సైతం అందజేశారు.

ఈ సందర్భంగా ముజిగల్ కొంపల్లి శాఖ ఫ్రాంచైజీ భాగస్వామి మాట్లాడుతూ? సరిగమప లిటిల్ ఛాంప్స్ తెలంగాణా పార్టిస్పెంట్లు తమ శాఖను సందర్శించడంతో పాటుగా తమ విద్యార్థులకు స్ఫూర్తి కలిగించడం పట్ల సంతోషంగా ఉన్నామన్నారు. వారి సందర్శన తమ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సైతం స్ఫూర్తి కలిగించిందన్నారు. ఈ యువ చాంఫియన్స్ ట్రినిటీ పరీక్షల సర్టిఫికెట్లను తమ విద్యార్థులకు అందజేయడం ఆనందంగా ఉందని ముజిగల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ యేలూరి అన్నారు.ఈ కార్యక్రమంలో సంగీతాభిమానులు, సామాన్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ మరుపురాని సంగీతానుభవాలను ఇది అందించింది.

# అమెరికాలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు..

## ముఖ్య అతిథిగా మహేశ్ బిగాల

న్యూజెర్సీ, మే2: అమెరికాలోని న్యూ జెర్సీలో శ్రీనివాస్ జక్కిరెడ్డి, భాస్కర్ పిన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. టీఆర్ఎస్ పేరు బీఆర్ఎస్‌గా మారిన తర్వాత ఇది మొట్టమొదటి సభ. ఈ సభకు ముఖ్య అతిథిగా మహేష్ బిగాల హాజరయ్యారు. అయన మాట్లాడుతూ.. తెలంగాణలో జరుగుతున్నంత అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగడం లేదన్నారు. కొత్తగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం దేశానికే తలమానికంగా మారిందని చెప్పారు. తెలంగాణలో ఎంతో అభివృద్ధి జరుగుతుందని, బీఆర్ఎస్‌తో దేశంలో భారీ రాజకీయ మార్పులు వస్తాయని అన్నారు. కేసీఆర్ లాంటి నాయకుడు దేశానికి అవసరమని చెప్పారు.

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి దేశానికే ఆదర్శమని, వచ్చే రోజుల్లో మళ్లీ బీఆర్ఎన్ ప్రభుత్వం స్థాపితమవుతుందని మహేశ్ బిగాల పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అన్ని రాష్ట్రాల ఎన్నారైలను ఏకం చేస్తామని, పార్టీని మరింత బలోపేతం చేస్తామని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూఎస్ఏ లీడర్లు శ్రీనివాస్ జక్కిరెడ్డి (న్యూజెర్సీ అండ్ న్యూయార్క్), భాస్కర్ పిన్న (డెలావేర్), శ్రీశైలం గదాసు, కిరణ్ తోట, శ్రీనివాస్ మేలి, ప్రశాంత్, మహేశ్ పాల్గొన్నారు.

# శ్రీ రాజరాజేశ్వరి దేవికి అగ్గిపెట్టెలో ఇమిడే బంగారు చీర బహూకరణ



రాజన్న సిరిసిల్ల, మే2:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి సిరిసిల్లకు చెందిన విజయ్ అనే భక్తుడు మంగళవారం అగ్గిపెట్టెలో ఇమిడే రెండు గ్రాముల బరువు ఉండేబంగారంతో చీరను బహూకరించారు. ముందుగా రాజన్నను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేసిన పిదప తానే స్వయంగా నేసిన అగ్గిపెట్టె లో ఇమేడే చీరను శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రతాప నవీన్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, శ్రీనివాస్ రెడ్డి, చంద్రగిరి శరత్ ఉన్నారు.

# కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## -జడ్పి చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ



రాజన్న సిరిసిల్ల, మే2:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందత్వ నిర్మూలన రాష్ట్రంగా మారడానికి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండవ విడత కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి కోరారు. మంగళవారం కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామంలో రెండవ విడత కంటి వెలుగు పరీక్ష శిబిరాన్ని జడ్పీ చైర్ పర్సన్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరహిత సమాజం నిర్మాణం కోసమే ముఖ్యమంత్రి కెసిఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో,ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలను నిర్వహించి వారికి మందులను కళ్ల అద్దాలను అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఎవరు కూడా కంటి సమస్యలతో బాధపడవద్దనే ముఖ్య లక్ష్యంతో కంటి పరీక్షలు నిర్వహించి, అద్దాలతో పాటు మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారని, అవసరమైన వారికి కంటి ఆపరేషన్ సైతం చేయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అకాల వర్షాలు విధ్వంసం సృష్టించాయని, నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దన్నారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి వారి ఖాతాల్లోనే పదివేల రూపాయల నష్టపరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య గౌడ్, గ్రామ సర్పంచ్ వంశీకృష్ణరావు, సింగిల్ విండో చైర్మన్ రామ్మోహన్ రావు, సర్పంచ్లు మల్లేశ్, లతమహెందర్, డైరెక్టర్ శ్రీనివాస్, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తీగల శ్రీనివాస్, డాక్టర్లు వేణుమాధవ్,భూపాల్, ప్రోగ్రాం ఆఫీసర్ రజిని,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# దమ్ముంటే ప్రజా సమస్యలపై మాట్లాడండి : బీజేపీ నేతలకు ప్రియాంక గాంధీ సవాల్

బెంగళూర్, మే2: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం పతాకస్థాయికి చేరింది. పోలింగ్ తేదీ దగ్గరపడుతుండటంతో ప్రధాన పార్టీల అగ్రనేతలు ర్యాలీలు, రోడ్‌షోలు, భారీ బహిరంగసభలతో రాష్ట్రాన్ని చుట్టేస్తున్నారు. ఇక కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ (ఖతీతిఎజీనిజీ ఉజీనిటప్త్రతి) బీజేపీ లక్ష్యంగా మంగళవారం పలు ప్రచార సభల్లో విమర్శలు గుప్పించారు. ప్రజల సమస్యలు, అంశాల ప్రాతిపదకన ఏ ఒక్క రాష్ట్రంలోనైనా పోటీ చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ నేతలకు ప్రియాంక సవాల్ విసిరారు. మాండ్యలో జరిగిన రోడ్‌షోలో ఆమె మాట్లాడుతూ గతం ఊసెత్తకుండా, ప్రజా సమస్యలే అజెండాగా ఎన్నికల్లో పోటీ చేయాలని కాషాయ నేతలను కోరారు.

మూడున్నరేండ్లుగా కర్నాటకలో కమలనాథులు ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, కానీ వారెన్నడూ తమ ముఖాలను మీకు చూపలేదని, కనీసం మీ ఎదుట నిలుచుని మాట్లాడే సత్తా వారికి లేదని దుయ్యబట్టారు. ఈసారి కర్నాటకలో ప్రజలు మార్పు కోరుతున్నారని, బీజేపీ ఓటమిపాలై కాంగ్రెస్ సర్కార్ కొలువుతీరుతుందని ప్రియాంక గాంధీ ధీమా వ్యక్తం చేశారు. కాగా, తిర్థహళ్లిలో మంగళవారం జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ మూడేండ్ల కిందట దొడ్డిదారిన బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని దుయ్యబట్టారు.

కాషాయ సర్కార్ అధికారాన్ని బలవంతంగా గుంజుకుందని ఆరోపించారు. బీజేపీ సర్కార్ అవినీతిపై ప్రధాని మోదీ ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ నిలదీశారు. కర్నాటకలో కాషాయ సర్కార్ అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు ఏం చర్యలు తీసుకున్నారో మోదీ వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ఇక్కడకు వచ్చి కాంగ్రెస్ తనపై 91 సార్లు దాడి చేసిందని చెబుతున్నారు తప్ప కర్నాటక గురించి ఏమీ మాట్లాడటం లేదని అన్నారు.ఇక కర్నాటకలో మే 10న అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

# కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజ కొంటాం.. పంట నష్టపోయిన వారికి ఎకరానికి రూ.10 వేలు చెల్లిస్తాం



కరీంనగర్, మే2: వందేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అకాల వర్షం కురిసిందని, ఎప్పుడు అకాల వర్షాలు పడ్డా 10 నుంచి 20 శాతం మాత్రమే పంట నష్టం జరిగేదని, ఇప్పుడు మాత్రం వందకు వంద శాతం పంటలు దెబ్బతిన్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రతి ఎకరానికి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని, ధాన్యాన్ని ఎటువంటి ఆలస్యానికి తావులేకుండా కొనుగోలు చేస్తామని చెప్పారు.

కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్ పూర్ గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన పంటలను, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని మంత్రి గంగుల మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతికి వచ్చిన పంట నేల పాలవడం బాధాకరమన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను కొంటామని హామీ ఇచ్చారు. పంట నష్టపోయిన వారికి ఎకరానికి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారని చెప్పారు.తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి తేమశాతం 20 వరకు వస్తే ఆ ధాన్యాన్ని కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపించాలని ఆదేశించినట్లు తెలిపారు. పొలాల దగ్గరే పంట నష్టపోయిన వారికి ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకుంటుందని, అన్నదాతలు అధైర్యపడవద్దని మంత్రి చెప్పారు. వర్షాలతో తడిసిన ధాన్యం తొందరగా ఎండే పరిస్థితి లేకపోవడంతో తేమ శాతం పరిమితిని 17 నుంచి 20కి సడలించాలని ఎఫ్‌సీఐని కోరినట్లు వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా 5 వేల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ఇప్పటికే రూ.1350 కోట్ల విలువైన సుమారు 7 లక్షల 51 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు.

# ప్రయాణికుల భద్రత కోసం ప్రత్యేక యాప్.. సిరిసిల్ల ఎస్పీ వినూత్న ఆలోచన.. మంత్రి కేటీఆర్ అభినందన

రాజన్న సిరిసిల్ల, మే2:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రయాణికుల భద్రత కోసం ఆ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ (ంఎప్త్రతిశ్రీ ఓజీప్త్రజీతీజేని) వినూత్న ఆలోచన చేశారు. జిల్లా ప్రజల సురక్షిత ప్రయాణం కోసం ప్రత్యేకంగా 'అభయ' యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. మై ట్యాక్సీ సేఫ్ అనే ట్యాగ్‌లైన్‌తో ఉండే ఈ 'అభయ' యాప్ ప్రయాణికుల రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. రాష్ట్రంలో ప్రయాణికుల భద్రత కోసం తీసుకొచ్చిన తొలి యాప్‌గా అభయ యాప్‌కు గుర్తింపు దక్కింది. సిరిసిల్లలోని మినీ స్టేడియంలో జరిగిన జిల్లా పోలీస్ క్రీడల ముగింపు కార్యక్రమంలో ఈ అభయ యాప్‌ను మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు.

జిల్లాలోని ఆటో రిక్షాలు, క్యాబ్‌ల లో ప్రయాణికులకు మరింత భద్రత, సౌకర్యాలను కల్పించడం కోసం క్యూ ఆర్ కోడ్‌ను అమల్లోకి తీసుకువచ్చిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను, పోలీస్ యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. జిల్లాలోని ఆటోలు, క్యాబ్‌ల యాజమానుల నుంచి అవసరమైన డాక్యుమెంట్లు, సమాచారం సేకరించి డిజిటలైజ్ చేసి క్యూ ఆర్ కోడ్ రూపంలో తీసుకొచ్చారు. ప్రయాణికులు ఆటో లేదా క్యాబ్‌లోని క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసినప్పుడు డ్రైవర్ ఫోటో వివరాలతో పాటుగా వాహనానికి సంబంధించిన వివరాలు వస్తాయి.

ఎమర్జెన్సీ కాల్ లేదా టెక్స్ట్, ఎమర్జెన్సీ కంప్లెయింట్, రేటింగ్ అనే మూడు రకాల ఆప్షన్‌లు కనిపిస్తాయి. ప్రయాణికులు సురక్షితం కాదనే పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పుడు కాల్ లేదా టెక్స్ట్ రూపంలో ఫిర్యాదు చేస్తే వాళ్లు ప్రయాణిస్తున్న వాహనం లైవ్ లోకేషన్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్తుంది. వారు వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందజేస్తారు. డ్రైవర్ అసభ్యకర ప్రవర్తన, ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హిట్ అండ్ రన్ చేసిన సందర్భాల్లో అభయ యాప్ ద్వారా కంప్లెయింట్ చేయవచ్చు. అందుకే ప్రయాణికులు సురక్షితంగా గమ్యం చేరడానికి ఈ యాప్ తోడ్పడుతుంది.

# నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ అత్యంత కీలకం : డీజీపీ

హైదరాబాద్, మే2:। నేర పరిశోధన మరింత వేగవంతంగా జరిపేందుకు ఫోరెన్సిక్ సైన్స్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని డీజీపీ అంజనీ కుమార్ సూచించారు. నేరపరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్‌ను టూల్‌గా ఉపయోగించేందుకు రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓల నుంచి సీపీల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని డీజీపీ కార్యాలయం నుంచి నిర్వహించారు. ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ డైరెక్టర్, అడిషనల్ డీజీ షికా గోయల్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ నేర పరిశోధనలలో సరికొత్త సవాళ్లయిన సైబర్ క్రైమ్ పరిశోధనలోనూ ఈ ఫోరెన్సిక్ సైన్స్ కీలక పాత్ర వహిస్తుందని అన్నారు. దాంతో పాటు పోస్కో కేసుల పరిశోధనలోనూ దీన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలు ముఖ్యంగా పోలీసశాఖ బలోపేతానికి, ఆధునిక యంత్ర సామగ్రికి సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందన్నారు. దీంట్లో భాగంగానే బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ టవర్‌ను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు.ప్రజాస్వామ్యంలో శాంతి భద్రతల పరిస్థితి నియంత్రణలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, దీనికి నిదర్శనం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ఉదాహరణ అని పేర్కొన్నారు. పౌరుల ఆత్మ గౌరవానికి పోలీస్ అధికారులు విలువనివ్వాలని, ఇందుకు తమ పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతీ ఒక్కరికి మర్యాదతో మాట్లాడాలన్నారు. ఎంత టెక్నాలజీ, ఆధునిక సౌకర్యాలున్నా ఒక వ్యక్తి ఆత్మ గౌరవానికి విలువ ఇవ్వకపోతే అన్నీ నిష్ప్రయోజనమన్నారు. పోలీస్ శాఖలో ఉన్న దాదాపు 80వేల మంది పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు కూడా తాము ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వెళ్లే ఇతర నగరాలు, రాష్ట్రాలు దేశాల్లోనూ పోలీసుల నుంచి ఇదేవిధమైన డిగ్నిటీని కోరుకుంటారని స్పష్టం చేశారు.

కస్టోడియల్ వాయిలెన్స్, మరణాలపై అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. రాష్ట్ర పోలీస్‌శాఖలో మరో మూడు, నాలుగు నెలల్లో అత్యధిక సంఖ్యలో మహిళా పోలీస్ అధికారులు నియామకం కానున్నారని, ప్రస్తుత ఆధునిక భావాలు, టెక్నాలజీ సవాల్‌గా ఉంటుందని, వారికి గౌరవ మర్యాదలు ఇవ్వడంతో పాటు, ఇంటి పెద్దగా శిక్షణ నివ్వాలని డీజీపీ సూచించారు. తెలంగాణా ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీకి దేశంలోనే మరే రాష్ట్రంలో లేనంతటి ఆధునిక పరికరాలున్నాయని వెల్లడించారు. ఫోరెన్సిక్ లాబ్‌లో జనవరి 2022లో 7,186 పరిశోధనా కేసులుండగా, 2023 ఏప్రిల్ నాటికి 2,093కు పరిమితమయ్యాయని, కేసుల పరిశోధనలో వేగవంతం చేయడంపై ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీ సైంటిస్టులు, అధికారులను అభినందించారు.

తెలంగాణా ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీ డైరెక్టర్, అడిషనల్ డీజీ శిఖా గోయల్ మాట్లాడుతూ పోస్కో కేసుల పరిశోధనలో వారంరోజుల్లోనే నివేదికలను ఇచ్చే ఫోరెన్సిక్ ల్యాబ్‌గా.. తెలంగాణ ల్యాబ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని వెల్లడించారు. ఇక నుంచి ప్రతీ సోమావారాన్ని ప్రాపర్టీ రిటర్న్ డేగా పరిగణిస్తున్నట్టు ప్రకటించారు. నార్కోటిక్స్, మాదక ద్రవ్యాల గుర్తింపులో అత్యంత ఆధునిక ఎక్విప్మెంట్‌ను సమకూర్చుకున్నామని, ఇది కేవలం 30 నిమిషాల్లోనే సింథటిక్ లాంటి డ్రగ్స్‌ను గుర్తిస్తుందని తెలిపారు. ఫేక్ వీడియోలను కూడా గుర్తించడంలో ఎఫ్ఎస్ఎల్ కీలక పాత్ర వహిస్తోందని అన్నారు. నేర పరిశోధన త్వరితగతిన చేపట్టేందుకు ఫోరెన్సిక్ సైన్స్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఎల్‌కు చెందిన సైంటిస్టులు కే అంజన, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అందరం కలిసి పనిచేద్దాం, నా రాజీనామాకు ఆమోదం తెలుపండి.. ఎన్సీపీ క్యాడర్‌కు శరద్ పవార్ విజ్ఞప్తి

ముంబై, మే2: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్ పవార్ తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించడం ఆ పార్టీ క్యాడర్‌లో కలకలం రేపింది. శరద్ పవార్ తన రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన మద్దతుదారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శరద్ పవార్ పార్టీ క్యాడర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. వృద్ధాప్యం, ఆరోగ్య సమస్యల కారణంగా తాను రాజీనామా నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. పార్టీలో ఎప్పటిలాగే అందరం కలిసి పనిచేద్దామని, తన రాజీనామాకు అందరూ ఆమోదం తెలుపాలని ఆయన కోరారు.

తాను రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగడం లేదని, తన పొలిటికల్ లైఫ్ ఎప్పటిలాగే కొనసాగుతుందని, కాకపోతే పార్టీ అధ్యక్ష పదవిని వదిలేయడంతోపాటు ఇకపై ఎన్నికల్లో పోటీచేయబోనని చెప్పారు. అయినా ఎన్సీపీ శ్రేణులు ఒప్పుకోవడం లేదు. శరద్ పవార్‌తో మాట్లాడి రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ఒప్పించాలని ఆయన కుమార్తె సుప్రియా సూలేకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో శరద్ పవార్ అన్న కొడుకు, మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ పార్టీ శ్రేణులతో మాట్లాడారు. పెద్దాయన వయసును, ఆరోగ్యాన్ని పరిగణలోకి తీసుకుని ఆయన నిర్ణయాన్ని గౌరవించాలని కోరారు. ఆయన గట్టిగా నిర్ణయం తీసుకున్నారని, ఇక ఆ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గే అవకాశమే లేదని చెప్పారు. రాజీనామా వెనక్కి తీసుకోవాలని సుప్రియా సూలే తన తండ్రి పవార్‌ను కోరే ప్రయత్నం చేసిందని, కానీ ఆమెకు పెద్దన్నగా తాను ఆమె ప్రయత్నాన్ని అడ్డుకున్నానని అజిత్ పవార్ చెప్పారు.

అయితే, పవార్ రాజీనామాను అంగీకరించాలా.. వద్దా..? అనే దానిపై పార్టీ సీనియర్ నాయకులతో ఒక కమిటీ వేశామని, ఆ కమిటీ నిర్ణయానికి అందరం కట్టుబడాలని అజిత్ పవార్ కోరారు. పవార్ జీ కూడా కమిటీ నిర్ణయానికి కట్టుబడి ఉంటారని చెప్పారు.

# రోడ్డు పక్కన నీటి కుంటలో దాహం తీర్చుకున్న పులి..వాహనదారుల రియాక్షన్ నెక్స్ట్ లెవెల్..!

న్యూఢిల్లీ, మే2: జంతువులు, మానవుల మధ్య అనుబంధానికి సంబంధించిన ఎన్నో వీడియోలు ఇంటర్‌నెట్‌లో కోకొల్లలుగా కనిపిస్తాయి.

ఈ క్లిప్‌ల్లో కొన్నింటిలో వన్యప్రాణుల పట్ల కొందరు అభ్యంతరకరంగా ప్రవర్తిస్తే మరికొందరు వాటి పట్ల దయతో వ్యవహరించిన వీడియోలూ ఉన్నాయి. ఐఎఫ్ఎస్ అధికారి పర్వీన్ కస్వన్ నెట్టింట షేర్ చేసిన లేటెస్ట్ వీడియోలో మనుషులు, జంతువుల మధ్య ఉండాల్సిన సామరస్యతను చాటిచెపుతుంది.

యూపీలోని కటర్‌నియగట్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో తీసిన ఈ వీడియోను కస్వన్ ట్విట్టర్‌లో షేర్ చేస్తూ ఈ పోస్ట్‌కు ఐఎఫ్ఎస్‌కు చెందిన మరో బ్యూరోక్రాట్ ఆకాష్ దీప్ భధ్వన్‌కు క్రెడిట్ ఇచ్చారు. ఈ వీడియోలో అటవీ మార్గంలోని రోడ్డు ప్రక్కన నీటి కుంటలో పులి నీరుతాగుతుండటం కనిపించింది. దీంతో రోడ్డుకు ముందు, వెనుక కార్లు నిలిచిఉండటం చూడొచ్చు.

పులికి కొంత ప్రైవసీ ఇచ్చేలా వాహనాలన్నీ దానికి దూరంగా నిలిచిపోయాయి.

రోడ్‌స్టాపర్ !! కటర్‌నియగట్ డబ్ల్యూఎల్ఎస్ నుంచి అని పోస్ట్‌కు క్యాప్షన్ ఇచ్చారు.

ఈ వీడియోను ఆన్‌లైన్‌లో షేర్ చేసినప్పటి నుంచి 80000 మందికి పైగా వీక్షించారు. పులి నీరు తాగుతుండగా దాన్ని డిస్ట్రబ్ చేయకుండా కార్లను దూరంగా ఆపిన టూరిస్టులు, స్థానికులను నెటిజన్లు ప్రశంసించారు. వాహనదారులు పాటించిన దూర దృష్టిపై యూజర్లు ప్రశంసలు గుప్పించారు.

# టీచర్ల బదిలీలకు అడ్డంకులు



అమరావతి, మే2:ఉపాధ్యాయ బదిలీలు చేపట్టేందుకు 2022లో విడుదల చేసిన జీవో నెంబర్ 187, 190లను ఉపసంహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.39 విడుదల చేసింది. ఈ జీవోలపై హైకోర్టు లో కేసులు ఉండడంతోనే వాటిని ఉపసంహరించుకు న్నట్లు ప్రభుత్వం తెలిపింది. అందరికీ ఆమోద యోగ్యం కాని రీతిలో బదిలీల జీవోలు విడుదల చేయడంతో చాలా మంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు హైకోర్టులో రిట్ పిటిషన్లు వేశాయి. ఈ నేపథ్యంలో 2022లోనే జరగాల్సిన బదిలీలు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో ఆగిపోయాయి. అయితే గత ఏడాదిలోనే జరగాల్సిన బదిలీలు ఇక ఎప్పుడు జరుగుతాయో తెలియకుండా పరిస్థితి ఉంది. ఇటీవల విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారా యణ మీడియాతో మాట్లాడుతూ వేసవి సెలవుల్లో చేయగల్గితే చేస్తామని, లేకుంటే ఆ తర్వాతే బదిలీలు ఉంటాయని చెప్పారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాలు తెలుపుతున్నాయి. అన్ని సంఘాలతో మాట్లాడి వీలైనంత ఎక్కువ మందికి ఆమోదమయ్యేలా విధానాలు రూపొందించి వేసవి సెలవుల్లోనే బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వేసవి సెలవుల తర్వాత బదిలీలు అంటే టీచర్ల ధ్యాసంతా బదిలీలు, ప్రమోషన్ల మీదనే ఉంటుందని, పిల్లలకు మంచి చదువు చెప్పే అవకాశం పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. టీచర్ల బదిలీలకు సంబంధించి పకడ్బంధీ మార్గదర్శకాలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పదే పదే కోర్టుల నుండి సమస్యలు రాకుండా పూర్తి స్థాయిలో ఒక ట్రాన్స్‌ఫర్స్ కోడ్‌ను రూపొందించే పనిలో ఉన్నామని ఇటీవల విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఇందు కోసం ఇతర రాష్ట్రాల్లో ఉన్న పద్ధతులను కూడా అధ్యయనం చేస్తామని చెప్పారు. అయితే గతంలోనే సంధ్యారాణి పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌గా ఉన్న సమయంలో ట్రాన్స్‌ఫర్స్ కోడ్‌కు సంబంధించి ఒక ముసాయిదాను రూపొందించారు. వాటిని ఉపాధ్యాయ సంఘాలకు కూడా అందించారు. కానీ ఆ తర్వాత వచ్చిన కమిషనర్ చినవీరభద్రుడు ఆ ముసాయిదాను బుట్టదాఖలు చేశారు. ప్రభుత్వం మళ్లిట ట్రాన్స్‌ఫర్స్ కోడ్ అంటోంది. దీని కోసం చట్టం చేయాల్సి ఉంది. అంతకు ముందు వివిధ రాష్ట్రాల్లో అమలవతున్న విధానాన్ని సమగ్రంగా పరిశీలించాలి. అయితే ఇవన్నీ జరిగేదెప్పుడు చట్టం వచ్చేది ఎప్పుడుబదిలీలు జరిగేది ఎప్పుడని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కనీసం జూన్ ఆఖరు నాటికైనా ట్రాన్స్‌ఫర్స్ కోడ్‌ను రూపొందించి బదిలీలు నిర్వహించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హృదయరాజు డిమాండ్ చేశారు.

ఒక వేళ ఉపాధ్యాయ సంఘాలను ఒప్పించి బదిలీలు చేపట్టాలన్నా పాఠశాలల క్రమబద్ధీకరణ కోసం విడుదల చేసిన జీవోలు అడ్డంకిగా ఉన్నాయి. క్రమబద్ధీకరణ జీవో 117కు వ్యతిరేకంగా హైకోర్టులో ఉపాధ్యాయ సంఘాలు, సామాజిక కార్యకర్తలు కేసులు వేశారు. తెలుగు మీడియం నుండి పూర్తిగా తప్పించి ఇంగ్లీష్ మీడియంలోనే బోధించడం, ఒక సెక్షన్‌కు టీచర్, స్టూడెంట్ రేషియా?? 1:40 ఉండాల్సిది 1:53 గా మార్చడం, ఎలిమెంటరీ స్థాయిలో 1:20గా ఉండాల్సింది 1:30గా మార్చడం, 3,4,5 తరగతులను మూడు కిలోమీటర్లలోపు ఉన్న పాఠశాలల్లో తీసుకెళ్లి కలపడం లాంటి క్రమబద్ధీకరణ చర్యలకు వ్యతిరేకంగా హైకోర్టులో కేసులు నమోదయ్యాయి. ఈ కేసులు తేలకుండా సాధారణ స్థితిలో బదిలీలు జరిపే అవకాశం లేదు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం ఆమరణ నిరాహార దీక్ష

## కామారెడ్డిలో జర్నలిస్టుల ఇళ్లస్థలాలు లాక్కున్న సర్కారు



కామారెడ్డి, మే2: (నేటినిజం ప్రతినిధి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఇతర మండలాలలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు ప్రకటించారు. మంగళవారం నాడు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ధర్నా చౌక్ లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం దశల వారి ఆందోళన చేపడుతామని అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు కృష్ణచారి, విజయానంద్ సిద్దాగౌడ్, బొక్కల వేణు లు ప్రకటించారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంలో 2007లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాలను తెలంగాణ సర్కారు లాక్కున్నారని జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాల కోసం దశల వారి ఆందోళన చేపడుతున్నామని అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని సంఘ నాయకులు హెచ్చరించారు. జర్నలిస్టుల నిరాహార దీక్ష శిబిరానికి పలు పార్టీల ప్రజాసంఘాల నాయకులు వచ్చి మద్దతు తెలిపారు. బిజెపి అసెంబ్లీ ఇంచార్జ్ వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర నాయకులు సిద్ధ రాములు, సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, రైతు జేఏసీ నాయకులు, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు విద్యార్థి సంఘాల నాయకులు జర్నలిస్టుల దీక్షలకు సంఘీభావం తెలిపి పోరాటం చేయడానికి మద్దతు ప్రకటించారు.

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్షలు విజయవంతంగా నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు అన్ని నియోజకవర్గాల మండల కేంద్రంలో ఉన్న అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎచిఏఈ నేషనల్ కౌన్సిల్ సభ్యులు కృష్ణమాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయానంద్, ఫెడరేషన్ సభ్యులు సాయిలు యాదయ్య మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు నియోజవర్గం, మండల మండల జర్నలిస్టులకు, ఇళ్ల స్థలాలను వెంటనే ఇవ్వాలని ఎచిఏఈ డిమాండ్ చేస్తునీదన్నారు .

తెలంగాణ రాష్ట్రం వచ్చి తొమ్మిది సంవత్సరాలు అవుతున్న జర్నలిస్టులకు ఇండ్ల కొరకు స్థలం కేటాయించి, ఆ స్థలాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం కొరకు తీసుకోవడం జరిగిందని, మళ్లీ సీఎం కేసీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవం వచ్చేముందు బైపాస్ పక్కన ఇండ్ల స్థలం కొరకు బోర్డు పెట్టారు కానీ , ఇంతవరకు అక్కడ ఇండ్ల స్థలాల సేకరణ జరగలేదని, ఇప్పటికైనా బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇళ్లస్థలాలు ఇవ్వాలని లేకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సిద్ధ గౌడ్. వేణు, ప్రవీణ్ గౌడ్, కృష్ణమూర్తి, ప్రవీణ్, సాయిలు, నర్సింలు, శ్రీనివాస్, నర్సాగౌడ్, భాస్కర్, కరుణాకర్, లింగం, రాజు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మౌనిక కుటుంబానికి 5 లక్షల ఆర్థిక సాయం



హైదరాబాద్, మే2: గత నెల 29న రాంగోపాల్‌పేట్ డివిజన్ కళాసీగూడలో నాలాలో పడి మరణించిన చిన్నారి మౌనిక కుటుంబానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5లక్షల ఆర్థిక సాయం చెక్కును సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అందజేశారు.

కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, జోనల్ కమిషన్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ సుదర్శన్, మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర టీఎన్జీఓ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్‌కు రాజన్న ప్రసాదం



రాజన్న సిరిసిల్ల, మే2:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికై మొదటి సారిగా మంగళవారం కరీంనగర్ కు విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీ మారం జగదీశ్వర్ కు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉద్యోగులు కరీంనగర్ పట్టణములోని టీఎన్జీఓ భవన్ లో ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా రాజన్న ఆలయ పిఆర్ఓ, రాష్ట్ర టీఎన్జీఓ కార్యవర్గ సభ్యులు ఉపాధ్యాయుల చంద్ర శేఖర్ రాజన్న కండువా కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా టీఎన్జీఓ కార్యదర్శి దారం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రాజేష్ భరద్వాజ్ ఉన్నారు.

# విశాఖ ఉక్కును కాపాడేది కేసీఆరే : మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, మే2: విశాఖ ఉక్కును కాపాడే సత్తా కేసీఆర్‌కు మాత్రమే ఉన్నదని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మూడేండ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి చరిత్ర సృష్టించారని వెల్లడించారు. సీఎం కేసీఆర్ తరహాలో పరిపాలించడం ఎవరి వల్లా కాదని.. అందుకే యావత్తు దేశం కేసీఆర్ వైపు చూస్తున్నదని చెప్పారు. పలు రాష్ట్రాల్లోని ప్రజలు తమకు కేసీఆర్ వంటి సీఎం కావాలని, కేసీఆర్ తరహా పాలన కావాలని అడుగుతున్నారని తెలిపారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ సభలకు జనం బ్రహ్మరథం పడుతున్నారని, అక్కడ బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. తెలంగాణ కార్మిక శాఖ ఆధ్వర్యంలో మేడే వేడుకలను సోమవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మంత్రులు మల్లారెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. తానూ కార్మికుడినేనని.. కార్మికులకు ధైర్యం చెప్పేందుకు.. భరోసానిచ్చేందుకే ఖాకీ దుస్తులు వేసుకొని వచ్చానని చెప్పారు. ఏపీలో రెడ్డి, కమ్మ, కాపు అంటూ కుల రాజకీయాలు చేస్తున్నారని, కానీ ప్రజలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఏపీ ప్రజలను పట్టించుకునేది కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమేనని, పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసే సత్తా కేసీఆర్‌కు మాత్రమే ఉన్నదని పేర్కొన్నారు. కేంద్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడాలని, ప్రపంచ కార్మిక దినోత్సవమైన మేడే సందర్భంగా కార్మికులంతా శపథం చేయాలని కోరారు. 2024లో కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని పునరుద్ఘాటించారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ మరింతగా అభివృద్ధి చెందుతుందని, కార్మికులంతా కష్టపడి పెద్ద పెద్ద బిల్డర్లు, కాంట్రాక్టర్లు కావాలని ఆకాంక్షించారు. ఈఎస్ఐలో కోట్ల రూపాయల డిపాజిట్లు ఉన్నా కేంద్రం కార్మికుల వైద్యం కోసం రూపాయి ఇవ్వడంలేదని విమర్శించారు.

దోపిడీ నుంచి విముక్తి కల్పించిన కేసీఆర్: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఏండ్లుగా దోపిడీకి గురవుతున్న కార్మికులకు విముక్తి కలిగించిన ఘనత



సీఎం కేసీఆర్‌దేనని ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు లేక వేల పరిశ్రమలు మూతబడి కార్మికులు రోడ్డునపడ్డ ఉదంతాలున్నాయని గుర్తుచేశారు. స్వరాష్ట్రంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తూ పరిశ్రమలను, కార్మికులను కాపాడుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను పట్టించుకోలేదని, వారిని క్రమబద్ధీకరించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని తెలిపారు. హైదరాబాద్‌కు పెద్ద పెద్ద పరిశ్రమలు వస్తున్నాయని, దీంతో లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

# కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది

## -కౌన్సిలర్ బింగి మహేష్

## -విద్యార్థినిలకు కరాటే బెల్టుల ప్రధానం -





రాజన్న సిరిసిల్ల, మే2:(నేటినిజం ప్రతినిధి): విద్యార్థులు తమ ఆత్మస్థైర్యం పెంపొందించుకోవడానికి కరాటే దోహదపడుతుందని వేములవాడ పట్టణ కౌన్సిలర్ బింగి మహేష్ అన్నారు. మంగళవారం మహాలింగేశ్వర ఫంక్షన్ హాల్లో కథ్లాల్ మండల ఓకినావ స్పోర్ట్స్ కరాటే అకాడమీ మాస్టర్ అబ్దుల్ మన్నాన్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ నిర్వహించగా, విద్యార్థినిలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కరాటేలో బెల్టులు సాధించారు. ఈ కరాటే బెల్టు , గ్రేడింగ్ పరీక్షలో విద్యార్థినీలు అద్భుతమైన విన్యాసాలు ప్రదర్శించారు. అనంతరం అద్భుతమైన ఫలితాలు సాధించిన విద్యార్థులు, విద్యార్థినిలకు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కౌన్సిలర్ బింగి మహేష్ పాల్గొని విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారు చదువులో కూడా ముందుంటారని అన్నారు . ప్రస్తుతం కరాటే మార్షల్ ఆర్ట్స్ కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందని చిన్నారులు కరాటే మార్షల్ ఆర్ట్స్ ను నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అవగాహన పెంచడానికి మరియు సంరక్షణను మెరుగుపరచడానికి ఒక సున్నితమైన రిమైండర్

హైదరాబాద్, మే2: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 339 మిలియన్ల మంది ఆస్తమా బారిన పడ్డారని , 2025 నాటికి ఈ సంఖ్య 400 మిలియన్లకు పెరుగుతుందని అంచనా. అదనంగా, ఉబ్బసం ప్రతి సంవత్సరం సుమారు 250,000 మరణాలకు కారణమవుతుంది, ఇది ఒక ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా మారుతుంది. వ్యాధి యొక్క తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆస్తమా దినోత్సవం ఒక సున్నితమైన రిమైండర్‌గా పనిచేస్తుంది, ఇది ప్రతి సంవత్సరం మే మొదటి మంగళవారం నాడు నిర్వహించడం జరుగుతుంది. ఆస్తమా బారిన పడిన వ్యక్తులు మరియు మొత్తం సమాజంపై దాని ప్రభావం గురించి అవగాహన పెంచడానికి ఇది నిర్వహించబడుతుంది. చింఆ-2023 యొక్క థీమ్ - "అందరికీ ఆస్తమా సంరక్షణ," ఆస్తమా యొక్క ప్రపంచ ఆందోళనలను పరిష్కరిస్తుంది మరియు ఆస్తమా భారాన్ని మోస్తున్న అన్ని దేశాలలో సమర్థవంతమైన ఆస్తమా నిర్వహణ కార్యక్రమాల అభివృద్ధి మరియు అమలును ప్రోత్సహిస్తుంది. ఆస్తమా తీవ్రతపై డాక్టర్ విశ్వేశ్వరన్ బాలసుబ్రమణియన్, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ, హైదరాబాద్, మాట్లాడుతూ , "ఆస్తమా అనేది ఒక తీవ్రమైన వ్యాధి, ఇది సరిగ్గా నిర్వహించబడకపోతే ప్రాణాంతకమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా అనారోగ్యం మరియు మరణాలకు ముఖ్యమైన కారణం. ఆస్తమా గురించి అవగాహన పెంపొందించడం వలన ప్రజలు దీని దాడికి సంబంధించిన సంకేతాలను గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి మరియు భవిష్యత్తులో దాడులను నివారించడానికి చర్యలు తీసుకోవడానికి సహాయపడుతుంది." "ఆస్తమా గురించి అవగాహనను వ్యాప్తి చేయడం చాలా అవసరం ఎందుకంటే ఇది ఆరోగ్య సంరక్షణ నిపుణులు, విధాన రూపకర్తలు మరియు సాధారణ ప్రజలలో విద్య మరియు అవగాహనను ప్రోత్సహిస్తుంది "అని అన్నారు. ఉబ్బసం యొక్క నిర్వహణ కార్టికోస్టెరాయిడ్స్‌తో సాధారణ చికిత్సను కలిగి ఉంటుంది. ఉబ్బసం పెంచే అంశాలలో ధూమపానం మరియు పర్యావరణ కాలుష్య కారకాలు కీలకం.

# ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ సిద్దోగం



రాజన్న సిరిసిల్ల, మే2:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ సిద్దోగంకార్యక్రమం ఘనంగా జరిగింది, సోమవారం నుండి బుధవారం వరకు సిద్దోగం కార్యక్రమం ఘనంగా నిర్వహించడానికి స్థానిక గౌడ సంఘం నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి మంగళవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు, ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ దయతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు పండాలని కోరారు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిలుక అంజి బాబు, మాజీ సర్పంచ్ జువ్వాడి అనిల్ రావు, నాయకులు బైరగోని రమేష్ గౌడ్, పుల్కం రవి, బొడిగే అనిల్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు బండారి హన్మాండ్లు గౌడ్, వార్డు సభ్యుడు నేతికుంట అనిల్,గుండా శేఖర్ గౌడ్, సత్యం గౌడ్, బుర్ర తిరుపతి గౌడ్,దేవరాజం గౌడ్,నీరటి శ్రీనివాస్, రాచర్ల శేఖర్,నర్సయ్య,మడిపల్లి దేవయ్య,మారం దేవయ్య, మహేష్,పొన్నం శ్రీధర్ గౌడ్ తదితరులుపాల్గొన్నారు, అనంతరం మనోహర్ రెడ్డిని గౌడ సంఘం నాయకులు శాలువతో సన్మానించారు.

# సుడానిధులతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



ఖమ్మం, మే2: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 34,36 వ డివిజన్లలో మంగళవారం సుడా నిధులు రూ.40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ,సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రుద్రగాని శ్రీదేవి ఉపేందర్,పసుమర్తి రామ్మోహన్, నాయకులు కొత్త వెంకటేశ్వర్లు, వసంత్ బాబు,34,36 డివిజన్ల కార్యకర్తలు, మహిళలు,మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏ.ఈ శోభాన్ బాబు,వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా పట్టణ, ఆలయాభివృద్ధి పనులు

## -ఎమ్మెల్యే రమేష్ బాబు

## -అభివృద్ధి పనులపై సమీక్ష

రాజన్న సిరిసిల్ల, మే2:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ, ఆలయ అభివృద్ధి పనులను పారదర్శకంగా చేపడుతున్నట్లు ఎమ్మెల్యే రమేష్ బాబు అన్నారు. మంగళవారంఎమ్మెల్యే రమేష్ బాబు తన



నివాసంలో మంగళవారం కౌన్సిలర్స్ తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రు. 20 కోట్లతో పట్టణంలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులపై చర్చించారు. రానున్న కొద్దిరోజుల్లో రు. 12 కోట్లతో బండ్ పై 800 మీటర్లతో ఘాట్ నిర్మాణాలు, బండ్ సుందరీకరణ, రు. 10 కోట్లతో బద్దీ పోచమ్మ దేవాలయం వద్ద బోనాల మండపం, పలు అభివృద్ధి పనులపై, రు. 10 కోట్లతో పట్టణంలో జగిత్యాల బస్ స్టాండ్ నుండి దేవస్థానం వరకు, తెలంగాణ తల్లి నుండి కోరుట్ల వరకు జరిగే రోడ్ల నిర్మాణాలు, మోడరన్ దోభీఘాట్ ఆవశ్యకత, స్టేడియం, సినారె భవనాలు నిర్మాణాలపై, జంక్షన్ల బ్యూటీఫికేషన్, మిగిలిన, అవసరం అయిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్స్ నిర్మాణాలకు మరో 20 కోట్లతో మంత్రి వర్యులు కేటీఆర్ కి ప్రతిపాదనలు, రింగ్ రోడ్ చుట్టూ సెంట్రల్ లైటింగ్, డ్రెయిన్లు, పట్టణంలో ప్రధానమయిన రోడ్ల వెడల్పు, పారదర్శకంగా నిజమైన లబ్ధిదారులకు లబ్ధి చేకూరే విధంగా డబల్ బెడ్ రూం ఇండ్లు, దళిత బంధు మంజూరీలపై చర్చించారు. సంఘ భవన నిర్మాణాలకు, ఆర్వో ప్లాంట్ల నిర్మాణాలకు సీడీపీ నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఈ సమీక్షలో మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి- రాజుతో పాటు కౌన్సిలర్స్, ఎంఆర్వో రాజీ రెడ్డి, హౌసింగ్ పీడీ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, వాడా అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

# జూనియర్ సివిల్ జడ్జి ప్రతీక్ సిహాగ్‌కు ఘన సన్మానం




రాజన్న సిరిసిల్ల, మే2:(నేటనిజం ప్రతినిధి): హైదరాబాద్ కూకట్ పల్లి కోర్టుకు బదిలీపై వెళ్తున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రతీక్ సిహాగ్ కు మంగళవారం న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పెంటరాజు అధ్యక్షతన కోర్టు హాల్లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జూనియర్ సివిల్ జడ్జిని న్యాయవాదులు శాలువాతో సత్కరించి, మెమొంటో అందించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జ ప్రతీక్ సిహాగ్ మాట్లాడుతూ వేములవాడ కోర్టు నందు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన కాలంలో న్యాయవాదులుగా సహాయ, సహకారాలు అందించిన న్యాయవాద బృందానికి ధన్యవాదాలు తెలుపుతూ, బదిలీపై వెళ్తున్న అందుకు బాధగా ఉన్నప్పటికీ ఉద్యోగ ధర్మంలో బదిలీలు సహజమని, ఎక్కడికి వెళ్లినా వేములవాడ అడ్వకేట్ మిత్రులను మర్చిపోలేనని, రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో పనిచేయడం పూర్వజన్మ సుకృతం అని అన్నారు. సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ జడ్జి సట్టు రవీందర్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఏజిపి గుడిసె సదానందం బార్ అసోసియేషన్ అధ్యక్షులు పెంటరాజు కార్యదర్శి నక్క దివాకర్, సీనియర్ న్యాయవాదులు నేరెళ్ల తిరుమల్ గౌడ్, నాగుల సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు పిట్టల మనోహర్, పిట్టల భూమేష్, పోత్తూరు అనిల్ కుమార్, వేముల సుధాకర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు పురుషోత్తం, రేగుల దేవేందర్, చెర్ల ఆనంద్ కుమార్, జంగం అంజయ్య బొజ్జ నరేష్ రేగుల రాజ్ కుమార్, బొడ్డు ప్రశాంత్ కుమార్, అన్నపూర్ణ, సుజాత, మమత, సీనియర్, జూనియర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# మోడ్రన్ దోబీగాట్లు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేను సన్మానించిన రజక సంఘం నాయకులు



రాజన్న సిరిసిల్ల, మే 2: (నేటి నిజం ప్రతినిధి): వేములవాడ లో 1 కోటి 35 లక్షలతో నిర్మాణం కానున్న మోడ్రన్ దోబీగాట్లు వాటి అవగాహన కొరకు సిరిసిల్ల లో ప్రారంభమైన సందర్భంగా అక్కడి మన రజక సంఘం సోదరులు వెళ్లి యంత్రాల పనితీరును పరిశీలించి మెళకువలు తెలుసుకోవాలని ఎమ్మెల్యే వారికిసూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ , నాయకులు రామతీర్థపు రాజు , రజక సంఘం అధ్యక్షులు చింతలతాడెం దేవయ్య , సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాయల్ కానిన్ 'స్టార్ట్ ఆఫ్ లైఫ్' ప్రచారం ప్రారంభం- పెంపుడు జంతువుల యజమానులకు పెట్ పేరెంటింగ్‌పై అవగాహనే లక్ష్యం

హైదరాబాద్, మే2: రాయల్ కానిన్ ఆధ్వర్యంలో పెంపుడు జంతువుల యజమానులకు పెట్ పేరెంటింగ్‌పై అవగాహన కల్పించనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఇదే ఉద్దేశంతో 'స్టార్ట్ ఆఫ్ లైఫ్' ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రాథమిక మార్గదర్శక సూత్రాలలో ఒకటైన "మ్యూచువాలిటీ" సూత్రంపై ఆధారపడి రాయల్ కానిన్ మొదటిసారిగా కీలకమైన వాటాదారులతో భాగస్వామ్యం కలిగి ఉందన్నారు. పెంపుడు జంతువుల యజమానులు తమ కుక్కపిల్ల లేదా పిల్లికి తగిన ఆహారాన్ని అందించడంలో విఫలమైనప్పుడు లేదా విఫలమయ్యే ట్రెండ్‌ను తిప్పికొట్టడంలో సహాయపడటానికి, క్యాంపెయిన్ కిట్టెన్ ఓ కుక్కపిల్ల గ్రోత్ ప్రోగ్రామ్‌ను, కచ్చితమైన, సంపూర్ణమైన అనుభవంగా రూపొందించామన్నారు. స్టార్ట్ ఆఫ్ లైఫ్ క్యాంపెయిన్‌లో బ్లాగ్ పోస్ట్‌లు, సోషల్ మీడియా కంటెంట్, వెబ్‌నార్‌లతో సహా అనేక రకాల విద్యా సామగ్రి ఉంటుందన్నారు. పెంపుడు జంతువుల యజమానులు వారి పెంపుడు జంతువులు ఏర్పడే సంవత్సరాల్లో తగిన పోషకాహారం విలువ మరింత జ్ఞానాన్ని పొందేందుకు, వారి వ్యక్తిగత అవసరాలకు సరిపోయే ఆహారాన్ని అందించడం వల్ల కలిగే ప్రయోజనాల తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.